J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 16 20.09.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## కష్టకాలంలో మేమున్నామంటున్న...

# మన నెల్లూరోళ్ళు


- జి.వి.కె.రెడ్డి 10 కోట్లు
- ఆల్తూరు మహేష్‌రెడ్డి 2 కోట్లు
- మేకపాటి రాజమోహన్‌రెడ్డి 50 లక్షలు
- రత్నం మాస్టారి మనుమడు 5 లక్షలు

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలని ముంచేసిన.. వరద బారిన పడిన ప్రజలని ఆదుకోవడానికి అనేక సంస్థలు, పలువురు వ్యక్తులు పెద్ద మనసుతో ముందుకొస్తున్నారు. ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చాలామంది విరివిగా తమ విరాళాలని అందిస్తున్నారు.



దానగుణానికి మారుపేరైన మన నెల్లూరీయులు కూడా సహృదయంతో స్పందిస్తున్నారు. మానవత్వంతో తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.

గత వారం తెలంగాణ ముఖ్యమంత్రికి 5 కోట్లు అందజేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త జీవీకే రెడ్డి తాజాగా ఆంధ్రప్రదేశ్‌కి కూడా 5 కోట్లు ఇచ్చారు. ఆయన తన కుమారుడు సంజయ్‌రెడ్డి, మనుమలు కృష్ణ రాంభూపాల్, కేశవరెడ్డిలతో హైదరాబాదులో చంద్రబాబు నివాసానికి వెళ్లి అయిదు కోట్ల చెక్కుని అందజేశారు.



### ఒక్కో రాష్ట్రానికి కోటి చొప్పున... 2 కోట్లు అందజేసిన మహేష్‌రెడ్డి!

ఆధ్యాత్మికతత్పరుడు, పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత, ఏఎంఆర్ సంస్థల వ్యవస్థాపకులు ఆల్తూరు మహేష్‌రెడ్డి తమవంతు సాయంగా రెండు రాష్ట్రాలకి కలిపి 2 కోట్లు ప్రకటించారు. మహేష్‌రెడ్డి తన కుమారుడు నితేష్‌రెడ్డితో వచ్చి అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలుసుకుని

3 లో

## రాజకీయాలు వ్యాపారంగా మారిన తరుణంలో..

# షాకులు లేవు.. షేకులు లేవు.. అంతా ఫేక్

- వై.సి.పికి బాయ్ చెప్పిన బాలినేని!
- మంగళగిరిలో జనసేనానితో భేటీ!!



వైసీపీ ఓటమిపాలై కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాజ్యసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు.. ఒక్కొక్కరుగా జగన్‌మోహన్ రెడ్డికి నమస్కారం పెట్టి కూటమి పార్టీల పంచన చేరుతున్నారు. తాజాగా మాజీమంత్రి, జగన్ సమీప బంధువు, బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా అదే బాట పట్టి వైసీపీకి బాయ్ చెప్పేశారు.

ఒక్కొక్క నాయకుడు పార్టీని విడిచి వెళ్ళినప్పుడల్లా "జగన్‌కి షాక్" అంటూ వార్తాపత్రికలు, టీవీ ఛానెళ్ళు, సామాజిక మాధ్యమాలు హోరెత్తిస్తున్నాయి. వైసీపీ షేకైపోతోందని ఊదరగొడుతున్నాయి. అదంతా వారి భ్రమే..! అధికారం కోల్పోయిన పార్టీని వదిలిపెట్టి అధికారంలో ఉన్న పార్టీవైపు వెళ్లడం రాజకీయాల్లో సర్వసాధారణమైన విషయమే! ఇది అనాదిగా వస్తున్న ఆచారమే. తాజా ఉదాహరణలే తీసుకుంటే.. గతంలో కూడా 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడు చాలామంది నాయకులు జగన్‌ని వీడి బాబు చెంతకి చేరారు. అదే మళ్ళీ 2019లో వైసీపీ అధికారంలోకి

10 లో

## సుప్రీం కోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా


# సన్నపురెడ్డి ద్వారకనాథ్



3 లో

### తండ్రిని మించిన తనయుడిగా రాణిస్తున్న నెల్లూరు న్యాయవాది







# భక్తిశ్రద్ధలతో.. మిలాద్ ఉన్ నబీ

మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నెల్లూరులో ఈనెల 16న మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నగరంలోని కామాటివీధిలో ఉన్న ఆయేషా మసీదు నుంచి ముస్లిమ్‌సోదరులు పెద్దఎత్తున ప్రదర్శనలు చేశారు. అందంగా తీర్చిదిద్దిన మక్కామసీదు నమూనా లతో, గుర్రాలు ఒంటెలు ప్రత్యేకాకర్షణతో శోభాయమానంగా నిర్వహించిన నగరోత్సవం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మతపెద్దలు మహమ్మద్ ప్రవక్త బోధనలు వివరించారు. దివ్య ఖురాన్‌లోని ప్రవచనాలను వినిపించారు. అల్లాహ్ బోధించిన సన్మార్గంలో నడవాలని సందేశమిచ్చారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

# అవిశ్రాంత పోరాటయోధుడు ఏచూరి

- **జేవీవీ ఘన నివాళి**



ప్రజల సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయభాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టు యోధునిగా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ ఈనెల 12వ తేది ఢిల్లీలో తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే. దీంతో నెల్లూరుజిల్లాలోని వామపక్షవాదులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు అన్ని ప్రాంతాల్లో ఆయన్ను స్మరించుకుంటూ నివాళులర్పించారు. నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి విజ్ఞానభవన్‌లో జేవీవీ ఆధ్వర్యంలో ఈనెల 13న జరిగిన సంతాపసభలో వామపక్ష నాయకులు పాల్గొని, ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. డాక్టర్ ఎం.డి రఫీ, డాక్టర్ శ్రీనునాయక్, విద్యాచరణ్, చలపతి, అంకయ్య, రమేష్, రాము పాల్గొన్నారు.

# 'జానపద భాషా వైభవం'పై.. 29న ఉపన్యాసం

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న టీనగర్-చెన్నైలోని కృష్ణాహాల్, ఆంధ్రా క్లబ్‌లో 153వ ప్రసంగంగా 'జానపద భాషా వైభవం' అనే అంశపై సాహిత్యోపన్యాసం ఏర్పాటుచేశారు. ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డా. చిగిచెర్ల కృష్ణారెడ్డి పాల్గొని జానపద భాషా వైభవాన్ని వివరిస్తారని, సాహిత్యాభిమానులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఎన్‌బికెఆర్
# అధ్యాపకునికి అవార్డు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకునిగా ఉన్న డా.వి.మల్లికార్జున రెడ్డికి జెఎన్‌టి యూనివర్శిటీ ఇటీవల ఉత్తమ వ్యాయామ అధ్యాపకునిగా అవార్డు ప్రదానం చేసింది. 2024 విద్యా సంవత్సరానికి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొ.ఎస్ కృష్ణయ్యల నుంచి ఆయన ఆ అవార్డునందుకున్నారు. వ్యాయమ విద్యా విభాగానికి చేసిన విశిష్ట సేవలను గుర్తించి ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ డా. విజయ కుమార్‌రెడ్డి ఆయన్ను అభినందించారు.

# ఘనంగా ఇంజనీర్స్ డే



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల భారతరత్న డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇంజనీరింగ్‌లో డా. మోక్షగుండం సేవలు అద్వితీయమని ఆయన కొనియాడారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. డి.శ్రీనివాస్, ప్రొఫెసర్ పీవీ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖైదీలు సత్ప్రవర్తనతో జీవించాలి

## జిల్లా జైలును పరిశీలించిన మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్



జైలు జీవితం అనంతరం ఖైదీలందరూ సమాజంలో సత్ప్రవర్తనతో జీవించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. నెల్లూరు సమీపంలోని బుజబుజ నెల్లూరు వద్దనున్న కేంద్ర కారాగారాన్ని ఆమె ఇటీవల సందర్శించారు. ఆమె వెంట రాష్ట్ర మహిళా కమిషన్ సెక్రటరీ వసంత బాల, లీగల్ అడ్వైజర్ పూజిత యాదవ్ ఉన్నారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీల యోగ క్షేమాలను, వారికి కల్పిస్తున్న వసతి సౌకర్యాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. జైలులో వంటగది, స్టోర్ రూమ్, వైద్యశాలను పరిశీలించారు. జైలులో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను జైలు సూపరింటెండెంట్ రాజారావు ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని జైళ్లల్లో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను పరిశీలిస్తున్నామన్నారు. నెల్లూరు సెంట్రల్ జైలులో అన్ని సౌకర్యాలు బాగున్నాయని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. జైలులో తాము పరిశీలించిన అంశాలను జాతీయ మహిళా కమిషన్‌కు నివేదిస్తామని, ఖైదీల సంక్షేమానికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందేలా కృషి చేస్తామని ఆమె చెప్పారు. తొలుత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన స్టాల్‌ను ఆమె పరిశీలించారు. చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో పౌష్టికాహార స్టాల్ చాలా బాగుందని ఆమె కితాబిచ్చారు. ఈ సందర్భంగా మహిళా ఖైదీల ప్రాంగణంలో మొక్కను నాటారు. సెంట్రల్ జైలు అడిషనల్ సూపరింటెండెంట్ మహేష్ బాబు, డీఎస్పీ సాయి ప్రవీణ్, డెప్యూటీ జైలర్ కన్యాకుమారి, ఐసిడిఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీఓలు, జైలు అధికారులు పాల్గొన్నారు.

# ఏఎస్‌పేటలో వైభవంగా.. గంధమహోత్సవం



జిల్లాలో ప్రసిద్ధమైన ఏఎస్‌పేట దర్గాలో ఇటీవల శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మవారి 251వ గంధమహోత్సవం వైభవంగా జరిగింది. పీఠాధిపతి ఎస్‌జిఎన్ ఫయాజ్ అహ్మద్ సుగంధద్రవ్యాలు, అత్తరు, పన్నీరు వగైరాలతో కలసిన గంధ కలశాన్ని తలపై ఉంచుకుని, మహల్ నుంచి మేళతాళాలతో, ఫకీర్ల జరబులతో కలసి భక్తి కీర్తనలు పాడుకుంటూ పెద్దఎత్తున భక్తజన సందోహం మధ్య హజరత్ వారి దర్గా వద్దకు వచ్చి, హజరత్ అమ్మవార్ల సమాధులకు గంధలేపనం చేశారు. ప్రత్యేక ప్రార్థనల తర్వాత, గంధ ప్రసాదాలను భక్తులకు పంచి పెట్టారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆదేశాలతో, ఇఓ షేక్ మహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. వేలసంఖ్యలో భక్తులు ఈ ఉత్సవానికి తరలివచ్చారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐలు వేమారెడ్డి, గంగాధర్‌రావు, ఏఎస్‌పేట ఎస్ఐ సైదులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# 21న 'యాదే రఫీ'..మ్యూజికల్ నైట్



ప్రఖ్యాత గాయకుడు, దివంగత మహమ్మద్ రఫీ పాడిన మధురాతిమధురమైన పాటలను మరోసారి గుర్తుచేస్తూ ప్రముఖ గాయనీ గాయకులతో ఈ ఏడాది కూడా నెల్లూరులో పాటకచ్చేరీని ఏర్పాటుచేస్తున్నారు. మధురగాయకుడు మహమ్మద్ రఫీ 44వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 21న 'యాదే రఫీ' మ్యూజికల్ నైట్ ఏర్పాటుకు నిర్వాహకులు భారీ సన్నాహాలు చేస్తున్నారు. మహమ్మద్ రఫీపై అభిమానంతో 31 ఏళ్ళ నుంచి ప్రముఖ గాయకుడు జావీద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని స్థానిక మైనార్టీ నాయకుడు సయ్యద్ సమీ ఈనెల 14న ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. 21వ తేదీన నగరంలోని టౌన్‌హాలులో సాయంత్రం 7 నుంచి రాత్రి 10 గంటల వరకు మహమ్మద్ రఫీ పాడిన మధురగీతాలను గాయనీ గాయకులు అత్యద్భుతంగా ఆలపిస్తారని, సంగీతాభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో గాయకులు జావీద్, జీలు, మున్నా, మహబూబ్‌బాషా, అమానుల్లాఖాన్, ఖలీల్ పాల్గొన్నారు.

# సుజలాం.. సుఫలాం!



చక్కెర వ్యాధిగ్రస్తుడిని
అలరించి, ఆశల పల్లకిలో
ఊరించి ఊరేగించే
ఉత్తమోత్తమ తియ్యనైన
ప్రసాదం, ప్రేమామృతం
జామకాయంటేనే!
సంద్రానికి చేపల కోసం వెళ్లిన
జాలరికి సొరచేపతో వల బరువెక్కినట్లు
ఎన్నికలప్పుడు రాజకీయుని
కళ్ళ మెదళ్ళు ఓట్లకై వెదికినట్లు
జామకాయలు దొరికితే చాలు
హృదయాలు పరవశించిపోతాయి.
హృదయసీమల్లో జామవేళ్ళు
మొలకలెత్తి ఆశల పల్లకిలో
ఊరేగిస్తాయి.
మనో నేత్రాలు నవనవలాడే
జామ కోసం నిరీక్షించి
పళ్ళ దుకాణాలు పరీక్షించిన
నిఘా నేత్రాలు జామను ముద్దాడుతాయి.
అన్నమే లక్ష్యం కాని 'తీపి' రోగికి
కడుపు నింపే అమూల్య వరం
ఆత్మీయంగా హత్తుకొనే నేస్తం
జామే కదా!
జామ్‌ను దర్శించి స్పృశించలేని
తీపి యోధుడికి -
సంతృప్త జీవనసారాన్ని అందించే
అసామాన్య ఫలం 'సీతాఫలం' లాంటి
జామ ఫలమే!
జామకాయతో అతగాడి ఆరోగ్య సూత్రం
ముడిపడి మలచబడి ఉంటుంది
బ్రతుకు సఫలం కావాలంటే నిత్యం
జామకాయ తినడమే ఏకైక మార్గం!
అలా సాగితే జీవనయానానికి
భరోసా ఉంటుంది.
జామకాయతో మధుమేహుల
జీవితమే సఫలమే!
జామే అతగాడి జీవితాన్ని
జూమ్ చేసే సుఫలం!
నీదికాని లోకంలో జామే
నీకు దక్కేది ప్రియతమా!
సుజలాం.. సుఫలాం!!



**- చిన్ని నారాయణరావు**
9440202942

# మన నెల్లూరోళ్ళు

(మొదటిపేజీ తరువాయి)




కోటి రూపాయల చెక్కుని అందజేశారు. అలాగే తెలంగాణలో సైతం అక్కడి సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి నితీష్‌తో సహా వెళ్లి కోటి రూపాయల చెక్కుని ముఖ్యమంత్రికి అందించారు.

## మేకపాటి 50లక్షలు!



సీనియర్ రాజకీయవేత్త, మాజీ పార్లమెంటు సభ్యులు, ప్రముఖ కాంట్రాక్టర్ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కూడా తనవంతుగా రెండు రాష్ట్రాలకి కలిపి 50 లక్షల రూపాయలని తమ నిర్మాణ సంస్థ కృష్ణమోహన్ కన్‌స్ట్రక్షన్స్ పక్షాన ప్రకటించారు. ఇందులో భాగంగా ముందుగా 25 లక్షల రూపాయల డి.డిని స్పీడ్‌పోస్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి పంపించారు. మరో పాతిక లక్షల చెక్కుని హైదరాబాదులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మేకపాటి స్వయంగా అందజేశారు.

## తాత బాటలో రత్నం మాస్టారి మనుమడు!



గత ముప్పై సంవత్సరాలుగా దేశంలో ఎక్కడ ఏ చిన్న ప్రకృతి వైపరీత్యం సంభవించినా మన జిల్లాలో ముందుగా స్పందిస్తుండిన మానవీయ దాత స్వర్గీయ రత్నం మాష్టారు. అప్పట్లో, అంటే 1993లో సంభవించిన లాతూర్ భూ కంపం నుండి 2020 నాటి కరోనా వరకు రత్నం మాష్టారు స్పందించని కష్ట కాలమే లేదు. ఒక్క మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలో ఎక్కడ ఏ విపత్తు సంభవించినా ఆయన నేనున్నానంటూ స్పందించేవారు.

ఇప్పుడు ఆయన మనుమడు రోహిత్ కొర్రపాటి (వేణుగోపాల్ కుమారుడు) కూడా తాత బాటలో నడుస్తున్నాడు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుని కలుసుకుని తనవంతుగా 5లక్షల రూపాయల చెక్కుని అందజేశారు. వయసులో చిన్నవాడైనా గుణంలో పెద్దవాడనిపించుకున్నాడు రోహిత్.

చిన్న, పెద్ద అన్న బేధం లేకుండా ఎవరికి తోచిన రీతిలో వారు, ఎవరి స్థాయికి తగ్గట్లుగా వారు మేమున్నాం అంటూ.. ఆపన్న హస్తం అందిస్తున్న మన నెల్లూరోళ్లకి 'లాయర్' సేవాభివందనాలు!

• కొత్త సీసాలో.. పాత సారా

# పాత కాపులకే.. కొత్త పెత్తనం






జిల్లా వైసీపీకి నూతన సారథులు నియమితులయ్యారు. కానీ ఆ అతిరథమహారథులంతా పాత కాపులే కావడం విశేషం. గత ఎన్నికల్లో వైకాపా ఘోర పరాజయం చవిచూడడంతో, మళ్ళీ ఎలాగైనా సరే పార్టీలో జవసత్వాలు నింపి, భవిష్యత్తులో మళ్ళీ వైకాపా రాష్ట్ర పాలనాపగ్గాలు చేపట్టి తీరాలనే ఏకైక ధ్యేయంతో పట్టుబట్టి మరీ పార్టీ అగ్రనేతలు పావులు కదుపుతున్నారు. పార్టీని పటిష్టం చేయాలన్న సంకల్పంతో వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి, పార్టీకి నమ్మినబంట్లు ఎవరా అని ఆరా తీస్తూ, పార్టీ పదవుల విషయంలో ఎవరికేమివ్వాలో తర్జనభర్జనలు చేసుకుంటూ, ఆచితూచి అడుగు వేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 18న పార్టీ నాయకులతో తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జగన్‌మోహన్ రెడ్డి జిల్లాలోని నాయకులతో సమీక్షించడం జిల్లా నాయకుల్లో సంతోషం కలిగించింది. ఈ సందర్భంగా గతంలో వైసీపీకి కంచుకోటగా ఉన్న నెల్లూరు జిల్లాలో, పార్టీని మళ్లీ గట్టెక్కించే నాయకులెవరా అని ఆలోచించి మరీ కొత్త నియామకాలు చేసినట్లు సమాచారం. కందుకూరు నియోజకవర్గంతో సహా ఉమ్మడి నెల్లూరుజిల్లా వైకాపా అధ్యక్షునిగా మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నియమించారు. గతంలో ఆయన మంత్రిగానే కాక, జిల్లా పార్టీ నాయకునిగా కూడా ఉన్నవారే. ఎన్నో విమర్శలు–ఆరోపణలతో ఆయన మంత్రికాలం కాస్తా గడిచిపోయింది. అదేవిధంగా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ వైకాపా పరిశీలకునిగా మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నియమితులయ్యారు. రూరల్ నేతగా మొన్నటి దాకా చక్రం తిప్పిన వైకాపా కీలకనేత కూడా ఆయనే కావడం అందరికీ తెలిసిందే. ఎంపీగా, మంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఆయనది. అందులోనూ సీనియర్ నాయకులు కూడా.

నెల్లూరు రూరల్ నియోజకవర్గం సమన్వయకర్తగా రూరల్‌లో బాగా పట్టు ఉన్న డీసీసీబీ మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డిని నియమించారు. మంత్రిగా పనిచేసిన అనిల్‌ను కార్పొరేషన్ స్థాయికి తీసుకొచ్చారు. జిల్లా పార్టీ అధ్యక్షునిగా ఉన్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని నెల్లూరు నగర నియోజకవర్గం సమన్వయకర్తగా ఉండమన్నారు. ఇప్పటికే ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీకి సంబంధించి ప్రాధాన్యత గల పలు పదవుల్లో పనిచేశారు. అటు ఎమ్మెల్సీగా, ఇటు వైకాపా జిల్లా అధ్యక్షునిగా, మరోవైపు ఉపాధ్యాయ సంఘాల నేతగా కూడా రాణించారు.

అయినా, వీరందరూ పాత నాయకులే కదా.. ఇక కొత్తగా నియామకాలేమిటీ అని పార్టీవర్గాలే గుసగుసలాడుకున్నాయి. అటుకులు చిటుకులు మారండి.. అన్నట్లుగా

10 లో

## సుప్రీం కోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా

# సన్నపురెడ్డి ద్వారకనాథ్

## తండ్రిని మించిన తనయుడిగా రాణిస్తున్న నెల్లూరు న్యాయవాది



హైదరాబాదు హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా సమర్ధవంతంగా తన విధులు నిర్వహిస్తున్న యువ మేధావి సన్నపురెడ్డి ద్వారకనాథ్ ప్రతిష్టాత్మకమైన పదవిని తన సొంతం చేసుకున్నాడు. సుప్రీం కోర్టులో భారత ప్రభుత్వ పక్షాన అదనపు సొలిసిటర్ జనరల్‌గా ద్వారకనాథ్‌ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. క్యాబినెట్ హోదా కలిగిన నియామక కమిటీ ఈ పదవికి 6మంది పేర్లను ఆమోదించినట్లు ప్రకటిస్తూ సెప్టెంబర్ 9వ తేదీన భారత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులలో మొదటి పేరు ద్వారకనాథ్‌దే కావడం గమనార్హం. అంతే కాకుండా ఈ పదవికి మొత్తం భారతదేశం నుండి 6 మంది ఎంపిక కాగా వారిలో రెండు తెలుగు రాష్ట్రాలనుండి ఎంపికైన ఏకైక తెలుగువాడు మన ద్వారక్ కావడం మన నెల్లూరుజిల్లాకే కాకుండా తెలుగు జాతికే గర్వకారణం.

### తండ్రికి తగ్గ తనయుడిగా!

ద్వారకనాథ్ తండ్రి స్వర్గీయ సన్నపురెడ్డి దశరథ రామిరెడ్డి స్వగ్రామం నెల్లూరుజిల్లా కోవూరు. దశరథ రామిరెడ్డి ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. సుధీర్ఘ అనుభవం కలిగిన ప్రతిభావంతమైన న్యాయవాదిగా, నిష్పక్షపాత న్యాయమూర్తిగా ఆయన మంచి కీర్తిప్రతిష్టలు గడించారు.

భద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ & ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసి, 1992లో ఉస్మానియా యూనివర్సిటీ నుండి బీకామ్ డిగ్రీ అందుకున్నాడు దశరథరామిరెడ్డి వంశోద్ధారకుడు ద్వారకనాథ్. ఆ తరువాత తన నాన్న స్ఫూర్తితో 1995లో అదే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్ర పట్టా పొందాడు. తన తండ్రి వంశానికే కాకుండా ఆయన వృత్తికి కూడా వారసత్వాన్ని పుచ్చుకున్నాడు. ఆ ఏడాది డిసెంబర్‌లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో తన పేరు నమోదు చేసుకున్నాడు. రాష్ట్రం విడిపోయాక 2019లో బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణకి తన పేరుని బదిలీ చేయించుకున్నాడు. ఎన్నో ప్రతిష్టాత్మకమైన కేసులు వాదిస్తూ 1996 నుండి ఈనాటి వరకూ అంటే 27 సంవత్సరాల సుధీర్ఘ అనుభవంతో సంచలనాత్మక విజయాలని సాధించాడు ద్వారకనాథ్. అత్యంత ప్రతిష్టాత్మక కేసులలో ద్వారకనాథ్ ప్రతిభని గుర్తించిన తెలంగాణ హైకోర్టు, 2021 ఏప్రిల్‌లో ఆయనకి పదోన్నతి కల్పించి సీనియర్ న్యాయవాదిగా నియమించింది.

ద్వారకనాథ్ వాదించిన అనేక క్లిష్టమైన కేసులలో ఇప్పటివరకు వందకిపైగా ఆయనకి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. టాక్సేషన్ విభాగంలో ఆరితేరిన వ్యక్తిగా పేరుపొందిన సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాస్‌రెడ్డి శిష్యరికంలో ద్వారకనాథ్ కూడా ఆ విభాగంలో దిట్టగా పేరు గడించాడు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థల తరపున అనేక కీలక కేసులను అవలీలగా పరిష్కరింపచేసి జాతీయ స్థాయిలో ప్రతిభాశాలిగా ద్వారకనాథ్ గుర్తింపుని పొందాడు. అకుంఠిత దీక్ష, అంకిత భావం, వృత్తిపట్ల వున్న గౌరవం ద్వారకనాథ్‌కి సర్వోన్నత న్యాయస్థానంలో స్థానం కల్పించింది.

భారత ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్‌గా సుప్రీం కోర్టులో ఆయన తన సేవలు అందించనున్నారు. మూడేళ్ళపాటు ఈ పదవిలో కొనసాగుతారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నేతృత్వంలో ద్వారకనాథ్ తన విధులు నిర్వహిస్తారు.

తండ్రిని మించిన తనయుడిగా ఎదుగుతూ చిరుప్రాయంలో జాతీయ స్థాయిలో తన ప్రతిభని కనపరచే అవకాశాన్ని, అదృష్టాన్ని తన సొంతం చేసుకున్నాడు ద్వారక్. ఆయన భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ.. శుభాకాంక్షలు తెలుపుతోంది 'లాయర్'.



లాయర్
సెప్టెంబర్ 20, 2024

# ప్రపంచాన్ని వణికిస్తున్న 'మహమ్మారి' వ్యాధులు

అసలే రకరకాల విషజ్వరాలు, ప్రాణాంతకమైన గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలతో ప్రపంచం అల్లాడుతుంటే, తాజాగా మరోవైపు కోవిడ్ మహమ్మారి వ్యాధి మరో భయంకర రూపం (వేరియంట్)తో ప్రజల ప్రాణాలు తీసేందుకు వస్తోందన్న అంతర్జాతీయ సమాచారం ప్రపంచ మానవాళిని బెంబేలెత్తిస్తోంది. యూరప్‌లోని పలు ప్రాంతాల్లో పలుచోట్ల కొత్తగా 'గ్జెక్' (ఎక్స్ఇసి) అనే కోవిడ్ వేరియంట్ కేసులు నమోదు కావడం, అది శరవేగంగా విస్తరించి మరో ప్రాణాంతకమైన మహమ్మారిగా మారనుందనే ఆందోళనలు అనేకదేశాల్లో వినిపిస్తున్నాయి. మొదటిసారిగా దీనిని గత జూన్‌నెలలోనే జర్మనీలో శాస్త్రవేత్తలు గుర్తించారని, యూకె, యునైటెడ్ నేషన్స్, డెన్మార్క్ తదితర దేశాల్లో కోవిడ్-19 ఉపజాతిగా ఉన్న ఈ సరికొత్త వేరియంట్ రాకాసి ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటోందని కూడా వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఐరోపా, ఉత్తర అమెరికా, ఆసియాల్లోని 27 దేశాల్లో వందలాదిమంది ఈ రకం కోవిడ్‌తో బాధలు పడుతున్నారని, జర్మనీతో పాటు బెల్జియం, స్లోవేనియా, డెన్మార్క్, నెదర్లాండ్స్, తైవాన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, ఇటలీ, స్వీడన్, ఐర్లాండ్, కెనడా, స్పెయిన్ తదితర 15 దేశాల్లో దీనిని అధికారికంగా గుర్తించారని కూడా నిపుణులు చెప్తున్నారు. రెండు ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ల నుంచి పుట్టుకొచ్చిన హైబ్రిడ్ రకం వేరియంట్‌గా వైద్యనిపుణులు దీనిని విశ్లేషిస్తున్నారు. ఈ రకం కోవిడ్ వల్ల తొలుత అలసటగా ఉంటుందని, ఆ తర్వాత తలనొప్పి, గొంతునొప్పి, తీవ్రజ్వరం వస్తాయని దాని లక్షణాలుగా చెప్తున్నారు. దీని నుంచి రక్షణగా ఉండేందుకు టీకాలు వేసుకోవడం అవసరమని, రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, ముందస్తు పరీక్షలు చేయించుకుని భద్రంగా ఉండడం శ్రేయస్కరమని హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ వేరియంట్ మనదేశం వరకు రాలేదు కానీ, అన్ని ప్రాంతాలకు ఇది విస్తరించే ప్రమాదం ఉంది కనుక, అన్నిదేశాల వారు ముందుజాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా ప్రభుత్వాలు, ప్రజారోగ్య వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

దీంతో పాటు ఇంకోవైపు మరో ముప్పు కూడా ముంచుకొస్తోంది. ఎలాంటి ఔషధాలకు లొంగని 'సూపర్‌బగ్స్' లేదా యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)ల వల్ల ప్రపంచంలోని అనేక దేశాల్లో ఏటా మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇలాంటి ఇన్‌ఫెక్షన్ల పట్ల కూడా జాగ్రత్తలు అవసరం. ఇష్టమొచ్చినట్లుగా ఎవరిపాటికి వారు యాంటీబయాటిక్స్ వాడుతుండడం వల్ల ఆ మందులను తట్టుకునే శక్తిని రోగకారకమైన బాక్టీరియా సంతరించుకోవడంతో, యాంటీబయాటిక్స్ పనిచేయకుండాపోవడ వల్ల ఈ అనర్థాలు ప్రాప్తిస్తున్నాయి. గతంలో వీటివల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా పదిలక్షల మందికి పైగానే మృత్యువాత పడ్డారు కూడా. అలాంటి యాంటీబయాటిక్స్‌కు లొంగని జబ్బుల బారినపడి రానున్న పాతికేళ్లలో సుమారు 4 కోట్ల మంది మరణించే ప్రమాదం ఉందని తాజాగా వైద్యవిజ్ఞాన పత్రిక లాన్సెట్ వెల్లడించిన అధ్యయనాల్లో తేలింది. అలాంటి మరణాల్లో ఎక్కువగా, కనీసం కోటి మందికి పైగానే ఈ మూడుదేశాల్లో మరణాలు సంభవించే ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైద్యరంగాల్లోని నిపుణులు ఎంతగా శ్రమించి ఇలాంటి వాటి నివారణకు కృషిచేస్తున్నప్పటికీ, వాటికంటే శక్తివంతంగా తయారవుతున్న సూపర్‌బగ్స్ మానవాళికి ప్రాణాంతకంగా తయారవుతూనే ఉన్నాయి. ఏదేమైనప్పటికీ, ప్రపంచదేశాల్లో పెరుగుతున్న ఇలాంటి ముప్పులను గ్రహించి, ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండడం ఎంతైనా అవసరం. కోవిడ్ గుణపాఠాన్ని దృష్టిలోపెట్టుకుని ప్రతి చిన్నవ్యాధిని, ఆరోగ్యసమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా తగు పరీక్షలు, చికిత్సలు చేయించుకోవడం ముఖ్యం. అన్నిటికీ మించి ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించుకుని, తినే ఆహారపదార్థాలు, తాగే నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. చేతులు తరచూ శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవడం వగైరాలన్నీ నిరంతరం జరుగుతూనే ఉండాలి. వ్యాధులు వచ్చిన తర్వాత బాధలు పడేకంటే, క్రమబద్ధమైన ఆహారం, నియమబద్ధమైన జీవనశైలితో వ్యాధులకు దూరంగా ఉండడం అలవరచుకోవాలి. ప్రభుత్వాలు, పాలకులు, వైద్యారోగ్య సంస్థలు ఈ విషయాల పట్ల ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ, ప్రపంచాన్ని భయపెడుతున్న మహమ్మారి వ్యాధులను ఎప్పటికప్పుడు గమనించి, అలాంటి ముప్పుల నుంచి ప్రజలను కాపాడేందుకు అవసరమైన ముందుజాగ్రత్త చర్యలన్నీ కట్టుదిట్టంగా చేపట్టాలి.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## నేతలు దాతలు కావాలన్న సూచన బాగుంది!

గత వారం మన 'లాయర్'లో "నేతలు దాతలు కావాలి" అంటూ రాసిన పతాక శీర్షిక చాలా బాగుంది. రాజకీయాలని అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధుల ముసుగులో కోట్లు వెనుకేసుకుంటున్న బడా నాయకులకి ఆ సూచన చెంపపెట్టులాంటిది. నాయకుడు ఎవరైనా, ఆయన ప్రాతినిధ్యం వహించే పార్టీ ఏదైనా సరే కానివ్వండి, ప్రజలు కష్టాలలో వున్నప్పుడు ఆదుకోవడానికి వాళ్ళు ముందుకురావాలి. పార్టీలకి, రాజకీయాలకి అతీతంగా దాతృత్వంలో పోటీపడాలి. ముఖ్యంగా ఆంధ్రాలో మొన్నటివరకూ అధికారం వెలగబెట్టిన వైసీపీలో కీలక వ్యక్తులుగా వ్యవహరిస్తూ ప్రత్యేక విమానాలలో చక్కర్లు కొట్టిన సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వై.వీ.సుబ్బారెడ్డి లాంటి వాళ్ళు స్పందించాలి. వారితో పాటు తమ పదవులని అడ్డంపెట్టుకుని ప్రజాధనాన్ని అడ్డంగా దోచుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బొత్సా సత్యనారాయణ, రోజా, విడదల రజని, కొడాలి నాని, వెలంపల్లి శ్రీనివాస్, అనిల్‌యాదవ్, అంబటి రాంబాబు వారి ఇతర సహచర మాజీమంత్రులు కూడా తమ ఉదారత చూపాలి. రాజకీయ విమర్శలు మాని, జనం నుండి కొల్లగొట్టిన మొత్తం నుండి కొంతైనా మళ్ళీ జనానికి ఈ ఆపద సమయంలో తిరిగిచ్చేయాలి. ఇతర పార్టీల నేతలు కూడా రాజకీయాలని పక్కనపెట్టి సేవాభావంతో తమవంతు సహాయం అందించాలి!

– బి.లక్ష్మీధర్‌రెడ్డి, నెల్లూరు.

## ఎక్కడ చూసినా ముళ్లచెట్లే!

జిల్లావ్యాప్తంగా అటు పట్టణాలు, పల్లెల్లో రహదారుల వెంబడి ఎక్కడ చూసినా ముళ్ళచెట్లు బాగా పెరిగిపోయి ఉన్నాయి. నెల్లూరు నగరంలో రోడ్లమధ్య ఉన్న డివైడర్లలో కూడా పలుచోట్ల ముళ్ల చెట్లు పొదలుపొదలుగా పెరిగిపోతున్నాయి. వాటిని తొలగించి, వాటి స్థానంలో పూలచెట్లు లేదా మొక్కలు వేసుకుంటే మంచిది కదా!..అనేకప్రాంతాల్లో ఖాళీస్థలాల్లోనూ, వాటి చుట్టుపక్కల అంతా ముళ్లకంపల మయంగానే ఉంటోంది. ఇవన్నీ విషసర్పాలకు కూడా ఆవాసాలుగా మారుతున్నాయి. స్థానికంగా ఉండే నాయకులు లేదా అధికారులు వాటిని తొలగించి, మంచి మొక్కలు నాటితే పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనం కూడా పెరుగుతుంది కదా!..

– కెవిఎస్ వెంకటసుబ్బయ్య, కావలి.

## రాజధాని ఏర్పాటుపై పునరాలోచన చేయాలి!

ఇటీవల విజయవాడ, అమరావతి ప్రాంతాలలో వరదలు సృష్టించిన భీభత్సం వర్ణనాతీతం. కొన్ని వందల కుటుంబాలు గంగపాలయ్యాయి. ప్రభుత్వం ఈ దుర్ఘటనలని ఒక హెచ్చరికగా భావించాలి. రాజధాని ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచన చేసి నిర్ణయం తీసుకోవాలి. దృష్టంతా కేవలం అమరావతిపైనే పెట్టకుండా విజయవాడ, గుంటూరు, మంగళగిరిని కూడా రాజధానిలో భాగంగా కలిపి అన్ని ప్రాంతాలని సమాంతరంగా అభివృద్ధి చేయాలి. అనుభవజ్ఞులు, మేధావులు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గతానుభవాలని దృష్టిలో పెట్టుకుని సముచిత నిర్ణయం తీసుకుంటారని ఆశిద్దాం!

చేవూరు చంద్రశేఖరరెడ్డి, జగదీష్ నగర్, నెల్లూరు.

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 56

## సుంకంతో శోకం...

# ధరలు 'సలసల' - జనం విలవిల!

*"ఏం కొనేటట్లు లేదు...*
*ఏం తినేటట్లు లేదు నాగులో నాగన్న*
*ధరలిట్లా మండబట్టి నాగులో నాగన్నా...*
*ధరలు మీద ధరలెక్కె నాగులో నాగన్న"*

అని ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం విడుదలైన "ఎర్రోడు" సినిమాలోని పాటలా... ఆకాశమే హద్దుగా దేశంలో నిత్యావసరాల ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. అదే సినిమాలో.. **"నిప్పుల్లో పడ్డ ఉప్పులాగా... రేట్లిట్లా చిటపట లాడతా ఉంటే.. బతికేదెట్టయ్యా"** అని డైలాగ్ చెప్పినట్లుగా కూడా... నిత్యావసర ధరలు ఎప్పటికప్పుడు పైపైకి పోయి పేలిపోతున్నాయి తప్ప క్రిందకి రావడంలేదు.

పెట్రోల్, డీజల్ ధరల భారీ పెరుగుదలతో, రవాణా చార్జీలు సైతం తడిసి మోపెడైపోవడంతో, జనం నిత్యం వాడుకునే సరుకుల ధరలు పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకి భరించలేనంత భారమై దూరమైపోతున్నాయి.

### సుంకంతో శోకం!

ఇప్పటికే పెరిగిన ధరలతో కుయ్యోమొర్రో అంటున్న పేదలు, సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలు ఖంగుతినేలా తాజాగా కేంద్రం మరో బాంబు పేల్చింది. జనం నిత్యం వాడుకునే వంటనూనెల ధరలు పెరిగేలా.. దిగుమతి సుంకం విధించింది. దీంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం.

వంటనూనెలపై 20 శాతం దిగుమతి సుంకం విధించడంతో, నూనెల ధరలు లీటరుకు 20 నుంచి 40 రూపాయల వరకు పెరిగాయి. లీటరు పామాయిల్ 94 నుంచి 114 రూపాయలకు, 107 రూపాయలున్న సన్‌ఫ్లవరాయిల్ 140 రూపాయలకు చేరుకున్నాయి. లీటరుపై సుమారు 20 నుంచి 30 రూపాయల దాకా ధరలు పెరగడం కేంద్రానికి పెద్దఎత్తున ఆదాయం తెచ్చిపెడుతుంది. కానీ, జనం పరిస్థితే గందరగోళం. చివరికి పూజలకు ఉపయోగించే నువ్వుల నూనె వంటి వాటి ధర కూడా లీటరుకు ఒక్కసారిగా 109 నుంచి 120కి పెరిగాయి. కేంద్రం వంటనూనెలపై సుంకం విధిస్తున్నామని అలా ప్రకటించిందో లేదో వెంటనే వ్యాపారవర్గాలు అప్రమత్తమైపోయి అప్పటికప్పుడే వాటి ధరలను పెంచేశాయి. ఆన్‌లైన్ వ్యాపారులు సైతం అప్రమత్తమై పెంచిన ధరలతో విక్రయాలు సాగించడం ప్రారంభించారు. కేంద్రం సుంకం విధించబోతోందని ముందే సమాచారం అందుకున్న వ్యాపారులు ఎక్కువ ధరలకు అమ్ముకోవచ్చనే ఆలోచనతో దుకాణాల్లో నిల్వ ఉన్న సరుకుని కూడా వెంటనే, రహస్య ప్రదేశాలకు తరలించేసి దాచిపెట్టేసుకున్నారు. కేంద్రం ప్రకటించేలోగా, అప్పటికే యధావిధిగా పెద్ద మొత్తంలో నూనెలను నిల్వ చేసుకునివున్న దుకాణాల వారికి ఇక పండగే పండగ. ధరలు ఇంత ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో వ్యాపారుల సంతోషం అంతాఇంతా కాదు. ఇక చిల్లర దుకాణాల్లో, పల్లె ప్రాంతాలలో వీటి ధరల విషయంలో ఎవరిష్టం వారిదే. అడిగేవారుండరు. వ్యాపారులు చెప్పిందే ధర. కొంటే కొనండి.. లేకపోతే పొండి అన్నట్లుగా కింది వారి వ్యహారం, వ్యాపారం.

### కొందరిక మోదం.. కొందరికి ఖేదం

ముడి పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్‌లపై కేంద్రప్రభుత్వం దిగుమతి సుంకం విధించడంతో వాటి ధరలు పెరగడం అనివార్యమైనట్లు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. అదేవిధంగా శుద్ధిచేసిన పామాయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ వంటి నూనెలపై ఇప్పటికే దిగుమతి సుంకం ఒకేసారి 12.5శాతం ఉండగా కేంద్రం దానిని 32.5 శాతానికి పెంచింది. అయితే, ఇలా సుంకం పెంచడం వల్ల విదేశాల నుంచి తీసుకొచ్చే నూనెల కొనుగోళ్ళు తగ్గిపోయి, దేశీయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటుందన్నది కేంద్ర పెద్దల ఆలోచన అని వ్యాపార నిపుణులు అంటున్నారు. అది నిజమే కావచ్చేమో కానీ, ప్రభుత్వ ఆలోచన ఆచరణలోకి వచ్చేలోగా దేశవ్యాప్తంగా ఉన్న సామాన్య ప్రజలపై భారీగా భారం పడుతోంది. ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే రోజుకు సుమారు 30లక్షల లీటర్ల నూనెలు విక్రయాలు జరుగుతుంటాయని అంచనా. దీన్నిబట్టి దేశవ్యాప్తంగా నిత్యం నూనెల వ్యాపారం ఎంత భారీగా ఉంటుందో ఊహించుకోవచ్చు. వ్యాపారవర్గాల్లో కూడా ఈ పెంపు కొందరిలో సంతోషం కలిగిస్తే, మరి కొందరిలో దుఃఖం నింపుతోంది. ముందుగానే ఆయిల్ ట్యాంకర్లను బుక్ చేసుకున్న వ్యాపారులు, అవి దుకాణాలకు వచ్చేలోగానే ధరలు పెరగడంతో ఆ పెరిగిన ధరలను చెల్లించడానికి ఇబ్బందులుపడ్డారు. అప్పటికే భారీగా నిల్వలున్న వారు మాత్రం బాగా లాభపడ్డారు, పడుతున్నారు కూడా. ప్రభుత్వాలు ఇలా ప్రకటనలు చేసే సమయంలో, కాస్త ముందు జాగ్రత్తగా వ్యవహరించి, ఒక తేదీని నిర్ణయించి, అప్పటికే నిల్వ ఉన్న సరుకులను ఖచ్చితంగా పాత ధరలకే అమ్మాలనే షరతును విధించి ఉంటే బాగుండేది. కొంతమంది ప్రజలైనా పాతధరలకు వాటిని కొనుగోలు చేసుకునే వీలుండేది. ప్రజలకు భారంగా పరిగణించే ఇలాంటి నిర్ణయాలపట్ల ప్రభుత్వాలకి ముందుచూపుంటే మంచిది.

### చట్టాలు కఠినతరం చేయాలి!

ఒక్క నూనెలే కాదు, మార్కెట్లో నిత్యావసరాల సరుకుల ధరలన్నీ అంబరాన్ని తాకుతుండడంతో... పేదలు, సామాన్యుల బతుకు దుర్భరంగా మారుతోంది. మార్కెట్లోకి వెళ్తే పప్పు, ఉప్పుల దగ్గర నుంచి అన్నిటి ధరలు మండిపోతున్నాయి. కొన్ని సరుకులను అసలు సామాన్యులు కాదుకదా, మధ్యతరగతి ప్రజలు కూడా కొనలేని పరిస్థితిలో ఉన్నాయి. పెరిగిన ధరలతో కుటుంబాలను పోషించుకోలేక అనునిత్యం ప్రజలు, బిడ్డలకు కడుపునిండా అన్నం పెట్టలేక గృహిణులు పడుతున్న బాధలను ప్రభుత్వాలు అసలు పట్టించుకోవడం లేదు. రైతులు పండించే ధాన్యం ధరలు అత్యంత తక్కువగా ఉండి, అవే ధాన్యాన్ని మిషనుకేసిస్తే బియ్యం ధర మాత్రం భారీగా ఉండడం మన దేశంలోనే సాధ్యం. రైతుల ఉత్పత్తులకు గిట్టుబాట ధర ఉండదు కానీ, మార్కెట్లలోకి వస్తే వాటి ధరలు అమాంతం పెంచేసి, మధ్యవర్తులు, దళారులు, వ్యాపారస్తులు ఇలా.. ఎవరికి తోచిన రీతిన వాళ్ళు జనం జేబులు కొల్లగొడుతుంటారు. పెరుగుతున్న రేట్లని నియంత్రించాలి. న్యాయసమ్మతమైన ధరలను నిర్ణయించాలి. దళారులు..మధ్యవర్తులు, వ్యాపారులు మాత్రమే కాకుండా, రెక్కలు ముక్కలు చేసుకుని పండించే రైతులకి కూడా న్యాయం జరగాలి. ధరలని నియంత్రించే వ్యవస్థలు మన దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్నాయి. కానీ, అవన్నీ మామూళ్ల మత్తులో జోగుతున్నాయి. ఈ దుస్థితి ఇకనైనా మారేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాయత్తం కావాలి. ఉచితాలతో, తాయిలాలతో ప్రజలని మభ్యపెట్టడం మాని, వారికి కావలసిన నిత్యావసరాలు అందుబాటు ధరలలో లభించేలా చట్టాలు కఠినతరం చేయాలి!

– రాజశ్రీ

# కొడవలూరులో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్

## క్యాన్సర్ నివారణకు అలుపెరుగని కృషిచేస్తున్న వేమిరెడ్డి దంపతులు

క్యాన్సర్ రహిత కోవూరు' సాధనలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ అధినేత.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు అలుపెరుగని కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, క్యాన్సర్ వ్యాధిని గుర్తించేందుకు విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కోవూరు నియోజకవర్గ ప్రజలకు బాగా ఉప యోగపడుతున్నాయి. మనిషిని జీవచ్ఛవంలా చేసే క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రజలకు పదేపదే చెప్తున్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇందుకూరు పేట మండలంలో ఈనెల 10నుంచి వారం రోజుల పాటు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత ఇప్పుడు కొడవలూరు మండల కేంద్రంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు ఇందుకూరుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 500 మందికి పైగా మహిళలు, పురుషులకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేసినట్లు ప్రశాంతిరెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షల సందర్భంగా క్యాన్సర్ లక్షణాలు ప్రాథమిక దశలో నిర్ధారణ అయితే, తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో టీటీడీ ప్రాణదాన పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తా




మన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం విజయవంతం చేసిన స్థానిక పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలి పారు. కొడవలూరులో ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌కు చెందిన క్యాన్సర్ స్పెషలిస్టులతో నిర్వహించే పరీక్షలకు 35 ఏళ్ళు పైబడిన ప్రతి మహిళ వచ్చి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. ప్రాణాంతక మైన క్యాన్సర్ భూతాన్ని తరిమికొట్టాలంటే క్యాన్సర్ స్క్రీనింగ్ ఒక్కటే మార్గమన్నారు. స్వచ్ఛంధ సంస్థలు సైతం ముందు కొచ్చి 'క్యాన్సర్ రహిత కోవూరు'కై కృషిచేయాలని ఆమె కోరారు.




# జిల్లాను స్వచ్ఛత వైపు నడిపిద్దాం

## • జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపు

నెల్లూరు జిల్లాను స్వచ్ఛత వైపు నడిపించేందుకు ప్రజలందరూ 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. ఈనెల 17న నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి 'స్వచ్ఛత హి సేవ' ర్యాలీని జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ ప్రారంభించారు. ఈ ర్యాలీ విఆర్‌సి వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి మీదుగా విఆర్‌సి మైదానం వరకు కొనసాగింది. గాంధీ బొమ్మ సెంటర్లో మహాత్మా గాంధీ విగ్రహానికి వారు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి జేసీ మాట్లాడుతూ, జిల్లాలో నేటి నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హి సేవ-2024లో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఇదే స్ఫూర్తితో అక్టోబరు 2వతేదీ వరకు జరిగే అన్ని కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని జేసీ పిలుపునిచ్చారు. కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ, ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే ఇక నుంచి జరిమానాలు విధిస్తామని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, జడ్పీ సీఇఓ కన్నమనాయుడు, డిఆర్‌డిఆర్, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, డెప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వేణుగోపాల్, రసూల్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాపూ బాటలో నడవాలి - జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ప్రతి ఒక్కరూ జాతిపిత గాంధీజీ చూపిన అభివృద్ధి బాటలో పయనించాలని, గ్రామాలను స్వచ్ఛత వైపు నడిపించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పిలుపునిచ్చారు. బాపూజీ ఆశయ సాధనలో భాగంగా మన గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛ గ్రామాలు, స్వచ్ఛ పట్టణాలుగా తయారుచేసేందుకు ప్రతి ఒక్కరూ 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమంలో పాల్గొనాలని, అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న పరిశుభ్రతా కార్యక్రమాలు, పచ్చదనం, పర్యావరణం, వ్యాసరచన పోటీలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ మొదలైన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# పేదల 'ఉపాధి' పథకాన్ని.. నిలువునా దోచేసుకుంటున్నారు

*గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధిని కల్పిస్తూ ప్రభు త్వాలు చేపట్టిన ఉపాధి పథకాన్ని కొందరు అధికారులు, సిబ్బంది గూడుపుఠాణీ చేసి లక్షలకు లక్షలు దోచేసుకుంటున్నారు. ఉన్న తాధికారులు, సామాజిక అధికారులు రంగంలోకి దిగి ముమ్మ రంగా తనిఖీలు చేపడుతుండడంతో ఈ గోల్మాల్ వ్యవహారాలన్నీ ఒకటొకటిగా బయటపడుతున్నాయి.*

ఇటీవల జిల్లాలోని కొండాపురం మండలంలో జరిగిన బహిరంగ విచారణలో, ఉపాధి పనులు కల్పించకుండానే పలు పంచాయతీల్లో పనులకు డబ్బులిచ్చినట్లు రాసేసి స్వాహాలకు పాల్పడినట్లు గుర్తించారు. గత ఏడాది ఈ మండలంలో సుమారు 16 కోట్ల రూపాయల నిధులతో జరుగుతున్న పనుల్లో దాదాపు 6 కోట్ల రూపాయల వరకు దుర్వినియోగం జరిగినట్లు సామాజిక తనిఖీ అధికారులు లెక్కలు తేల్చారు. 19 పంచాయతీలకు సంబం ధించి 98 లక్షల రూపాయలను రికవరీకి ఆదేశించారు కూడా. పలు గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించకుండానే వారి జాబ్ కార్డులపై పనులు ఇచ్చినట్లు, వారి వద్ద నుంచి కూడా వారానికి వంద రూపాయల వంతున డబ్బులు వసూలు చేసినట్లు కూడా గుర్తించారు. ఇలా అక్రమాలకు పాల్పడిన వారందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఉన్నతాధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఈ అక్రమాలకు ఇక అడ్డే ఉండదు.

# రైతుల కష్టం.. దళారుల పాలు



## • తీరని బాధలతో అన్నదాతల దిగాలు
## • పట్టించుకోని పాలకులు, అధికారులు

**జిల్లాలో రైతుల కష్టం దళారుల పాలవుతోంది. అధికారులు ఎన్ని రకాల సమీక్షలు, సమావేశాల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నా, మిల్లర్లు-దళారులు యథావిధిగా రైతుల రెక్కల కష్టాన్ని దోచుకుంటూనే ఉన్నారు. జిల్లాలో వరికోతలు మొదలుపెట్టారు. ధాన్యం విక్రయాలు ప్రారంభమయ్యాయి, అయినా ఇప్ప టికీ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటువేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఎప్పుడూ ఊకదంపుడు మాటలే తప్ప, ఆచరణలో రైతన్నల సమస్య లను పరిష్కరించేవారు లేక పోవ డంతో రైతులు చెప్పలేనన్ని బాధలు పడుతూనే ఉన్నారు.**



జిల్లాలో ఈసారి ఖరీఫ్ సీజన్‌లో రైతులు సుమారు లక్షా 50 వేల ఎకరాలకు పైగానే వరిని పండించారు. తీరా అమ్ముకునే దశకు వచ్చేసరికి, దళారులు మాయమాట లతో వారిని బురిడీ కొట్టించేసి వీలైనంత తక్కువ ధరకు ధాన్యం మూటలు ఎగరేసుకు పోతున్నారు. ఆరుగాలం కష్టించి పండించుకున్న వరి ధాన్యాన్ని విధిలేని పరిస్థితుల్లో తక్కువ ధరకే అమ్మేసుకుంటున్నారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యాన్ని పుట్టి 18,825 రూపాయలు, సాధారణ రకం వరిధాన్యాన్ని పుట్టి (850కిలోలు) 18,555 రూపాయలుగా నిర్ణయించి మద్దతు ధర ప్రకటించినప్పటికీ, ఆచరణలో అంత ధరలు దళారులు ఇవ్వడం లేదు. కేవలం 17వేల రూపాయలకే పుట్టి ధాన్యాన్ని మూటగట్టుకుపోతున్నారు. అయినా పట్టించుకునే నాథులు లేరు. దీంతో, పుట్టికి వెయ్యి రూపాయలు కూడా మిగలడం లేదని, పెట్టిన పెట్టుబడికి.. చేసిన కష్టానికి ఫలితం ఉండడం లేదని, తామెలా బతకాలని రైతన్నలు గోడుగోడుమంటున్నారు. పంటలు పండించడానికి ఎంతో శ్రమ ఉంటే, పండిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే కూడా రైతులు అంతకుమించి కష్టపడాల్సి వస్తోంది. ప్రభుత్వం తరపున ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకాకపోవడంతో దళారులు, వ్యాపారులు ఇదే అదనుగా రైతులకు ఎరవేసి వారి నుంచి తక్కువ మొత్తాలకే పంటను లాగేసుకుంటున్నారు. తూకా ల్లోనూ మోసాలు చేస్తున్నారు. పుట్టికి కనీసం వంద కిలోల దాకా మోసపు తూకాలు వేసి తీసేసుకుంటున్నా అదేమని అడగడానికి లేదు. ఇంతచేసీ, ఆ దళారులు కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులిస్తారా అంటే అదీ లేదు. త్వరలోనే ఇచ్చేస్తామంటూ రోజుల తరబడి తిప్పుకుంటూనే ఉంటారు. ఇన్ని బాధలు పడి సేద్యం చేయడం కంటే మానుకోవడమే మేలంటూ వేలాదిమంది రైతులు నిరాశకు గురవుతున్నారు.

### పంటలు అమ్ముకునేందుకు సదుపాయాలు లేవు :

ప్రభుత్వాలు, అధికారులు ఎప్పటికప్పుడు హడావిడి చేస్తూ 'రైతులను ఆదుకుంటాం' అంటుంటారే కానీ, పొలాల వద్దకు వచ్చి తమ సమస్యలు పట్టించుకునేవారే కరువయ్యారని, ఇక తమ కష్టాలు వారికెలా తెలుస్తాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక్క వరి ధాన్యమే కాదు, రైతులు ఎంతో కష్టపడి పండించే కాయగూరలు, ఆకుకూరలు..నిమ్మ, బత్తాయి, దానిమ్మ, మామిడి వంటి పండ్లతోటల సాగు ఎంతో కష్టసాధ్యమైనా, ఆ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు తగ్గ వసతులు లేవు. మంచి ధరలు వచ్చేదాకా తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు శీతల గోడౌన్లు వంటివి అసలే లేకపోవడంతో రైతులకు ఏళ్ళతరబడిగా ఈ బాధలు తప్పడం లేదు. దీంతో, మార్కెట్‌లలో వ్యాపారస్తులు అత్యంత తక్కువ ధరకే వాటిని కొనుగోలు చేసి రైతన్నలను నిరంతరం మోసం చేస్తూనే ఉన్నారు. దళారులు, వ్యాపారులు అంతా కుమ్మక్కై వారికి వారే తమ ఇష్టప్రకారం ధరలు నిర్ణయించేసుకుని, రైతులను దగా చేస్తూ లక్షలకు లక్షలు ఆర్జిస్తున్నారు. రైతులేమో కుటుంబాలను కూడా పోషించుకోలేని దీనావస్థలోనే ఉంటున్నారు. ఎంతోకాలంగా ఈ దగా సాగుతూనే ఉంది. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, పాలకులు మారినా నీతులు వల్లించడమే తప్ప రైతులకు మాత్రం న్యాయం జరగడం లేదు.

# నెల్లూరు కబుర్లు

## శరన్నవరాత్రులకు శ్రీకారం

**-శ్రీరాజరాజేశ్వరి దేవాలయంలో స్తంభ ప్రతిష్ఠ-**



రానున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రారంభ సూచకంగా నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 13న శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు స్తంభ ప్రతిష్ఠ చేసి పూజలు చేశారు. వందలాదిమంది మహిళా భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. అక్టోబరు 3 నుంచి 12 వ తేది వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారి మాలధారణ వేసుకుని పూజలు చేసే భక్తులు ఈనెల 20వ తేది నుంచి ఆలయం వద్దకు వచ్చి మాలధారణ చేసుకోవచ్చని, ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు భవానీ దీక్ష మాలధారణ చేస్తారని ఈ సందర్భంగా ఆలయ ఇఓ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. అక్టోబరు 11న ఇరుముడి కార్యక్రమం జరుగుతుందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా జరిగే ఈ కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజితమ్మ, దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాం తదితరులు పర్యవేక్షించారు.

### వరద బాధితులకు..

## పుస్తక దుకాణాలవారి విరాళం



విజయవాడలోని వరదబాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి నెల్లూరులోని పుస్తక దుకాణాల సంఘం వారు 52,116 రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని వారు ఇటీవల జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నిర్వాహకుడు సివిస్ రామచంద్రరావు, పుస్తక విక్రేతలు పి.రాఘువ, జనార్ధన్ (సంతానం బుక్‌షాపు), సివివి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరుని హుండీ ఆదాయం.. రూ.5.07 లక్షలు

నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 13న హుండీ లెక్కింపు జరిగింది. గత జూన్ 19 నుంచి సెప్టెంబరు 13 వరకు భక్తుల కానుకల ద్వారా ఆలయానికి 5,07,081 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



### 'జయభారత్'లో..

## గిరిజన మహిళలకు సీమంతాలు

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి, శ్రీ పరంజ్యోతి మానవసేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14న ఆసుపత్రి ప్రాంగణంలో గిరిజన మహిళలకు ఘనంగా సీమంతాలు నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని వారిని దీవించారు. గిరిజన మహిళలకు జయభారత్ ఆసుపత్రి వారు చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. గిరిజనులకు ఉచిత వైద్యసేవలందిస్తూ, ఆ బిడ్డలకు ఉచితంగా చదువుచెప్తూ, వారి అభ్యున్నతికి కృషిచేయడం గొప్ప విషయమన్నారు. ఆర్‌ఎస్ఎస్ ప్రాంత కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పుట్టా శేషు, సింహపురి వైద్యసేవాసమితి ఛైర్మెన్ పొన్నలూరు సీతారామిరెడ్డి, వైస్‌ఛైర్మెన్ బాలు సుబ్బారావు, కోశాధికారి గుర్రం సుధాకర్, జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, శ్రీ పరంజ్యోతి మానవ సేవాసమితి అధ్యక్షులు అక్షజ్ దాసాజి, డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుతో పాటు..

## హిందీలోనూ ప్రావీణ్యం సాధించాలి

**- క్షేత్రప్రచార శాఖ అధికారి పరవస్తు నాగసాయి సూరి**




భారతీయులను హిందీ భాష సంఘటితంగా ఉంచుతుందని, అందువల్ల మాతృభాష తెలుగుతో పాటు ప్రతి ఒక్కరూ హిందీలో ప్రావీణ్యత సాధించాలని నెల్లూరులోని భారతప్రభుత్వ క్షేత్ర ప్రచారశాఖ అధికారి పరవస్తు నాగసాయి సూరి విద్యార్థులకు పిలుపునిచ్చారు. హిందీ భాషా పక్షోత్సవ వేడుకలు నెల్లూరు సంతపేటలోని ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల (గుంట బడి) లో ఈనెల 17న ఘనంగా జరిగాయి. హిందీ భాషా దినోత్సవం(సెప్టెంబర్ 14) సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రారంభమైన పక్షోత్సవాలను భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, హిందీ నేర్చుకోవటం ద్వారా దేశంలో ఎక్కడైనా మన భవిష్యత్‌ను సులభంగా తీర్చిదిద్దుకుని అభివృద్ధిపథంలో సాగవచ్చని తెలిపారు. అనంతరం, విద్యార్థులకు హిందీ భాషకు సంబంధించి పలు పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. నెల్లూరు ఆలిండియా రేడియో ప్రోగ్రామ్స్ విభాగాధిపతి ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, శిశుసంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, హిందీ ఉపాధ్యాయులు పవన్‌కుమార్, భారతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### డా. కిషోర్స్ రత్నంలో..

## హిందీ భాషా దినోత్సవం



సెప్టెంబరు 14న హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని డా. కిషోర్స్ రత్నం మెడికల్ ఒలంపియాడ్ స్కూల్‌లో హిందీ భాషా దినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. హిందీ అధ్యాపకులు జిలానీబేగం, అరుణ ఈ సందర్భంగా హిందీ భాష ఔన్నత్యాన్ని తెలియజేశారు. మీరాబాయి భక్తిగీతాల మాధుర్యాన్ని, తులసీదాస్ 'రామ్‌చరిత్ మానస్' వైశిష్ట్యాన్ని విద్యార్థులకు వివరించారు. హిందీ భాషాంశాలు, వ్యాకరణ అంశాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులందించారు. అనంతరం, విద్యార్థులు ఉత్సాహంగా పాటలు, పద్యాలను ఆలపించారు. హిందీ ప్రాముఖ్యతను చాటుతూ నృత్యరూపకం ప్రదర్శించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా..శ్రీ జ్యోతి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలు



వినాయకచవితిని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని టౌన్‌హాలు వద్ద ఉన్న శ్రీ జ్యోతి వినాయక మందిరంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 6 నుండి 16వ తేదీ వరకు 11 రోజులపాటు శాస్త్రోక్తంగా ఎంతో వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు ఈ ఉత్సవాల రోజుల్లో నిత్యం స్వామివారికి విశేష పూజలు, విశిష్ట సేవలు చేశారు. నేత్రపర్వంగా ప్రత్యేక అలంకారాలు, పూలంగి సేవలు, గణపతి హోమాలు, అభిషేకాలు తదితర పూజలన్నీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందల సంఖ్యలో భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని జ్యోతి వినాయకస్వామిని దర్శించుకుని తరించారు. ఉత్సవాల్లో చివరి రోజైన ఈనెల 16వ తేదీ సోమవారం మధ్యాహ్నం మందిరం కమిటీవారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

## రెడ్‌క్రాస్‌లో.. ప్రధాని మోడీ పుట్టినరోజు



ప్రధాని నరేంద్రమోడీ 74వ పుట్టినరోజును పురస్కరించుకుని ఈనెల 17న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎం.ఎస్.ఆర్. స్పాస్టిక్స్ సెంటర్‌లో ఘనంగా వేడుకలు జరిపారు. దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ప్రధానమంత్రిగా మూడోసారి ఎన్నికై దేశాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్న నరేంద్ర మోడీ సేవలను కొనియాడారు. రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్తదానం చేస్తున్న దాతలను అభినందించారు. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, యడవల్లి సురేష్, గాంధీ ఆశ్రమం కమిటీ సభ్యులు గణేశం దయాకర్‌రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.




## విఎస్‌యులో.. 'స్వచ్ఛతా హి సేవ'



నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీ (విఎస్‌యు) ఎన్‌ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 17న 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య ఎస్ విజయభాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛభారత్ మిషన్ 10వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం, స్వచ్ఛతా హి సేవా ప్రచారం 7వ సంవత్సరానికి చేరుకోవడం ఈ కార్యక్రమాల విశిష్టతను తెలియచేస్తున్నాయన్నారు. స్వచ్ఛతా హి సేవా 2024 ప్రచారం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నారన్నారు. పరిశుభ్రతను కాపాడుకోవడం, స్వచ్ఛతను ఒక జీవన విధానంగా మార్చుకోవడం కోసం మన ప్రతిజ్ఞను సమిష్టిగా కొనసాగిద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత, 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా.కే. సునీత, ప్రిన్సిపాల్ ఆచార్య హెచ్.విజయ, ఆచార్య టీ.వీరారెడ్డి, కోట సునీల్ కుమార్, ఎన్‌ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్‌శంకర్, ప్రోగ్రాం అధికారులు, డా. కే.ప్రభాకర్, డా. బీవీ సుబ్బారెడ్డి, డా. ఎస్‌బి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు..

# ఊపిరిచ్చిన 'ఉద్యోగ మేళా'





- **900 మందికి ఉద్యోగాలు**
- **పరిశీలనలో మరో 750 మంది**
- **యువతలో వెల్లువెత్తుతున్న ఆనందం**

విపిఆర్ ఫౌండేషన్ అధినేత.. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్‌లో ఇటీవల నిర్వహించిన మెగా జాబ్ మేళా దిగ్విజయమైంది. ఈ జాబ్ మేళాలో పలు కంపెనీల్లో 900 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కడంతో వారంతా ఆనందాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లకి తమకు ఉద్యోగాలు వచ్చాయంటూ యువతీయువకులు ఆనందిస్తున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చొరవతో జరిగిన ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు పొందిన యువతీ యువకులకు విపిఆర్ సోదరులు వేమిరెడ్డి కోటారెడ్డి నియామక పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్ మేళా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ అని, ఆ కలలను సాకారం చేసుకునే దిశగా ఈ జాబ్‌మేళా జరగడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ జాబ్‌మేళాలో టెక్ మహేంద్ర కంపెనీ 350 మందిని నియమించుకోగా, శ్రీసిటీలోని హీరో మోటార్స్‌కు 326 మంది ఎంపికయ్యారని, పరిశీలన దశలోవున్న మరో 750 మందికి కూడా రెండు మూడు రోజులలో ఆఫర్ లెటర్స్ రానున్నాయన్నారు. ఎంపిక కాని యువతీ యువకులు కూడా నిరుత్సాహపడవద్దని, కోవూరు యువత కోసం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి జాబ్ మేళాలు నిరంతరం నిర్వహిస్తూనే ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వలంటీర్లుగా సేవలందించిన కోవూరు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, జాబ్ మేళాకు వచ్చిన వివిధ విభాగాలకు చెందిన 38 కంపెనీల ప్రతినిధులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# వైకాపా పాలనలో రైతులను నిర్లక్ష్యం చేశారు

## - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి




జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కీలకమైన వ్యవసాయ, ఇరిగేషన్ శాఖలను మూతేశారని, అసలు రైతుల కష్టనష్టాలను ఎవరూ పట్టించుకోలేదని, వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 17న ఆయన పొదలకూరు మండలం ప్రభగిరి పట్నం సమీపంలో ఉన్న కిసాన్‌క్రాఫ్ట్‌ను సందర్శించి, అక్కడున్న పనిముట్లను, యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కిసాన్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీలో తయారవుతున్న పరికరాలు అద్భుతమని, ఈ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి జరగడం గొప్ప విషయమన్నారు. ఆ సంస్థ మరింత అభివృద్ధి చెంది, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని కోరారు. కిసాన్ క్రాఫ్ట్ కంపెనీ తమ సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండటం సంతోషకరమన్నారు. 2018లో తాను వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ కంపెనీని ఇక్కడకు తీసుకొచ్చామని, ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయిన తర్వాత 2021లో ఉత్పత్తి ప్రారంభించారని, ఇప్పుడు మంచి స్థాయిలో ఉండటం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.81కోట్లు పెట్టుబడులు, 129మంది ఉద్యోగులతో పవర్ వీడర్లు, గ్రాస్ కట్టర్లు, స్ప్రేయర్లు, మినీ హార్వెస్టర్లు, వాటర్ పంప్స్ తదితర ఎన్నో పరికరాలు ఇక్కడ తయారుచేస్తున్నారని చెప్పారు. అధికారంలో ఉన్నా, గతంలో ప్రతిపక్షంలో ఉన్నా పేదల ప్రయోజనాలతో పాటు రైతుల విషయంలో తాను రాజీ లేకుండా పనిచేశానని ఆయన అన్నారు. ఫ్యాక్టరీ ఎం.డీ రవీంద్ర అగర్వాల్, ఫ్యాక్టరీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతమ్మ చొరవతో...

# ఎట్టకేలకు.. యల్లాయపాళెంకు బస్సు



నెల్లూరుకు కొద్దిదూరంలోనే ఉన్నప్పటికీ కొడవలూరు మండలంలోని యల్లాయపాళెంకు గత 9ఏళ్లుగా బస్సు లేకపోవడంతో ఆ గ్రామస్తులు జిల్లా కేంద్రమైన నెల్లూరుకు రావాలన్నా, మరింకెక్కడికైనా వెళ్లాలన్నా ఆటోలను ఆశ్రయించాల్సిందే తప్ప మరో ప్రత్యామ్నాయం లేని దుస్థితి. గతంలో నాయకులకు ఎన్ని సార్లు ఈ కష్టాలు విన్నవించుకున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ నేపథ్యంలో మొన్నటి ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వచ్చినప్పుడు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి గ్రామస్తులు తమ బాధలు చెప్పుకున్నారు. బస్సు సౌకర్యం లేక పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లాల్సిన తమ పిల్లలు, ఆసుపత్రులకు వెళ్లాలంటే వృద్ధులు, మహిళలు ఎన్ని అవస్తలు పడుతున్నారో ఆవేదనగా చెప్పారు. అందుకు స్పందించిన ప్రశాంతమ్మ, తాను విజయం సాధిస్తే, యల్లాయపాళెంకు తప్పకుండా బస్సు సౌకర్యం కలిగిస్తానని మాటిచ్చారు. ప్రజలందరి ఆశీస్సులతో ఆమె ఎమ్మెల్యే అయ్యాక, చేసిన వాగ్దానాన్ని మరచిపోకుండా ఇటీవల నూతన బస్సు సర్వీసును ప్రారంభించడంతో యల్లాయపాళెం ప్రజలు ఆనందభరితులయ్యారు. చెప్పిన మాట నిలబెట్టుకున్నందుకు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.

### నాగాయగుంటకు కూడా బస్సొచ్చేసింది

అదేవిధంగా, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగాయగుంట గ్రామానికి కూడా ఈనెల 16న ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తుల ఆనందానికి అవధుల్లేవు. దాదాపు 18 ఏళ్ళుగా ఈ గ్రామానికి బస్సు లేదు. ప్రజలు రాకపోకలకు ఆటోలపైనే ఆధారపడాల్సి వచ్చేది. వాహనాల సౌకర్యం లేక వారు ఎన్నో బాధలుపడ్డారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బస్సు సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేసిన కృషిని గ్రామస్తులు అభినందిస్తూ, ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు.



# తొలి నామినేటెడ్ పోస్టు.. కృష్ణయ్యకే!

## కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మెన్‌గా.. మన నెల్లూరీయుడు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి నామినేటెడ్ పోస్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బీసీలకు కేటాయించి, బీసీల పట్ల తమకున్న అభిమానం చాటుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇంతకాలంగా ప్రజలకోసం, పార్టీకోసం కష్టపడిన ఎందరో ఆశావహులు ఎదురుచూస్తున్న కీలకమైన నామినేటెడ్ పోస్టుల భర్తీకి తొలి అడుగు పడింది. విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్యను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఛైర్మెన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో బీసీ వర్గాల్లో ఆనందం వెల్లువెత్తింది. కృష్ణయ్య మన నెల్లూరుజిల్లా వాడే! కోవూరు తాలూక వెంకన్నపాళెం ఆయన స్వగ్రామం. ఏపీపీసీబీ ప్రధాన కార్యాలయంలో ఛైర్మెన్‌గా కృష్ణయ్య ఇటీవల బాధ్యతలు చేపట్టారు. తనకు ఈ పదవిని కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డెప్యూటి ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌లకు కృష్ణయ్య ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన కృష్ణయ్యను పార్టీ కార్యాలయ సిబ్బంది, నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. తొలి నామినేటెడ్ పోస్టును దక్కించుకున్న కృష్ణయ్య కార్యాలయ సిబ్బంది ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఐఏఎస్ అధికారిగా కృష్ణయ్య తనకున్న అపారమైన అనుభవంతో ప్రభుత్వానికి, ప్రజలకు ఉన్నతమైన సేవలు అందిస్తారని అందరూ ఆకాంక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, నాలెడ్జ్ సెంటర్ ఛైర్మెన్ గురజాల మాల్యాద్రి, ప్రోగ్రాం కమిటీ ఇంఛార్జ్ నున్న రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రోగ నిర్ధారణపై..

# నారాయణలో అవగాహన సదస్సు

నారాయణ వైద్య కళాశాల రజతోత్సవం (1999-2024) సందర్భంగా ఈనెల 14,15,16 తేదీల్లో నెల్లూరులో ఘనంగా నిర్వహించిన 6వ 'ఐఏపీఎం ఏపీ ప్యాథకాన్ సదస్సు' వైద్యులను ఆకట్టుకుంది. నారాయణ కళాశాలలోని రోగ నిర్ధారణ శాస్త్ర విభాగం నిపుణులు నగరంలో ఏర్పాటుచేసిన ఈ అంతర్జాతీయ సదస్సు మరియు వర్క్‌షాప్‌లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 500 మంది రోగ నిర్ధారణ శాస్త్రవేత్తలు పాల్గొనడం విశేషం. ఆధునిక విధానాలతో రోగనిర్ధారణకు సంబంధించిన అనేక అంశాలను వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఆర్గనైజింగ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కె.దుర్గ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి సదస్సును ప్రారంభించారు. బెల్జియం నుంచి వచ్చిన అనాటమిక్ పాథాలజిస్ట్, అంతర్జాతీయస్థాయిలో పేరు గడించిన రోగ నిర్ధారణ శాస్త్రవేత్త.. ప్రపంచ ఆరోగ్య సంస్థ సంపాదకీయ వర్గం సభ్యులలో ఒకరైన రాబర్టో సాల్గాడో ఈ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన 'క్యాన్సర్ చొరబాటు-తెల్ల రక్త కణాలు' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత వర్క్ షాప్‌ను కూడా నిర్వహించి రోగనిర్ధారణ విషయాల పట్ల అవగాహన కల్పించారు. రొమ్ము క్యాన్సర్ రోగులకు అధునాతన చికిత్స అందించ వచ్చని కూడా ఆయన చెప్పారు. అత్యాధునిక కృత్రిమ మేధస్సు (ఏఐ-ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్) ద్వారా రోగ నిర్ధారణలో వచ్చిన మార్పులు గురించి ఈ సదస్సులో పలువురు ప్రముఖులు వివరించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పీజీ విద్యార్థులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఆర్గనైజింగ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కె.దుర్గ, కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్, కోశాధికారి డాక్టర్ ఎం. విజయలక్ష్మి, సమన్వయకర్త, ప్రముఖ రోగ నిర్ధారణ నివారణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. పెంచలరెడ్డి, పెథాలజీ విభాగం నిపుణులు పాల్గొని సదస్సును విజయవంతంగా నిర్వహించారు.



# విధిరాత..ఎంత ఘోరమో కదా!



విధి ఎంతో బలీయమైనదంటారు. నిజమే కదా అనిపిస్తుంటుంది కొన్ని సంఘటనలు చూస్తే. కోతులు చెట్లమీద ఎగురుతుంటే ఒక ఎండిపోయిన కొమ్మ విరిగిపడడం, ఆ చెట్టు కిందే కూర్చుని ఉన్న ఆర్టీసీ డ్రైవర్ తలపై సరిగ్గా ఆ కొమ్మ పడడం, చెవి వద్ద దెబ్బతగిలి నెత్తురు కారుతూ అక్కడికక్కడే ఆయన మరణించడం చూస్తే.. విధిరాత ఎంత ఘోరంగా ఉంటుందో కదా అనిపిస్తుంది. కోవూరు వద్ద ఉన్న పడుగుపాడు ఆర్టీసీ వర్క్‌షాప్‌లో ఈనెల 17న జరిగిందీ దుర్ఘటన. చిత్తూరుజిల్లా పుత్తూరుకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీరాములు (61) తాను నడుపుతున్న ఆర్టీసీ బస్సుకు అద్దం పగిలిపోవడంతో రిపేరు కోసం అక్కడికి తీసుకువెళ్ళారు. ఈలోగా అక్కడ చెట్టు కింద కూర్చుని ఉంటే మృత్యువు చెట్టుకొమ్మ రూపంలో వచ్చి ప్రాణం తీసేసుకుంది. తిరుపతి జిల్లా నారాయణవనం మండలంలోని కృష్ణంరాజుకండ్రిగకు చెందిన ఆయన, పడుగుపాడుకు వచ్చి ప్రాణాలు పోగొట్టుకోవడం విధి విచిత్రం కాక మరేమిటి?...

# బాలుడిని బలిగొన్న బాణసంచా

## - మనుబోలు బీసీకాలనీలో విషాదం



మనుబోలులో వినాయక నిమజ్జనం రోజున బాణసంచా పేలుళ్ళకు ఓ బాలుడు బలైపోయాడు. మనుబోలు బీసీ కాలనీలో ఈనెల 16న ఈ ఘోరం జరిగిపోయింది. బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన ఉమామహేశ్వర్ అనే పన్నెండేళ్ల బాలుడు తన నానమ్మ, చెల్లెలుతో కలసి మనుబోలులో తన మామ శంకర్ ఇంటికి వచ్చాడు. వినాయక నిమజ్జనం రోజున ఉన్నట్లుండి ఒక్కసారిగా బాణసంచా పేలుడుతో బీసీకాలనీ దద్దరిల్లిపోయింది. ఈ ఘటనలో గాయపడిన ఉమామహేష్‌ను చికిత్సకోసం తరలిస్తుండగా దారిలోనే మరణించాడు. 8వ తరగతి చదువుతున్న తమ కుమారుడు ఇలా ఆకస్మికంగా మృత్యువు పాలుకావడంతో ఆ తల్లితండ్రుల బాధ వర్ణనాతీతం. ఆ పేలుళ్ళ దెబ్బకు బీసీ కాలనీ అంతా అల్లకల్లోలమైపోయింది. కొన్ని ఇళ్లు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరో 23 మంది గాయపడ్డారు కూడా. సరదాగా ఉత్సవాలు చూడడానికి వచ్చిన తమ బిడ్డను ఇలా మృత్యువు బాణసంచా రూపంతో కబళించడంతో ఆ బాలుడి బంధువులు శోకంతో కుమిలిపోయారు. ఈ దుర్ఘటనతో బీసీకాలనీ విషాదసాగరంలో మునిగిపోయింది.

## సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల భద్రతలపై..

# శ్రీసిటీ కార్మికులకు అవగాహన



శ్రీసిటీ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న స్థానిక వెర్మీరిన్ పరిశ్రమ ఆవరణలో కార్మికులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రత, చైన్ స్నాచింగ్ తదితర నేరాల గురించి కార్మికులకు తెలియజేసి, ఆ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. శ్రీసిటీ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, సిఐ బీవీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉద్యోగాలు, రుణాలు ఇస్తామని, లాటరీల పేరిట మోసపూరిత ప్రకటనలు చేస్తుంటారని, సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రలోభపెడుతూ ప్రజల బ్యాంకు ఖాతాల నుండి డబ్బులు తస్కరిస్తున్నారని తెలిపారు. వారి మాయమాటలకు మోసపోకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తెలియని వ్యక్తులు, నెంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, లింకులకు స్పందించవద్దని సూచించారు. వాటిని వెంటనే తొలగించాలన్నారు. భయపెడుతూ ఫోన్లు వస్తే ఏమాత్రం ఆందోళనకు గురికాకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అదేవిధంగా, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే, హెల్మెట్ వాడడం వల్ల కనీసం ప్రాణాలైనా రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ డ్రైవింగ్, వాహనం నడుపుతూ సెల్ ఫోన్‌లో మాట్లాడడం, మద్యం సేవించివుండడం వంటివి నేరమని, పట్టుబడితే జరిమానా విధిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, అతివేగం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.

### మహిళా కార్మికులు అప్రమత్తంగా ఉండాలి :

మహిళా కార్మికుల భద్రతపై అవగాహన కల్పిస్తూ, పరిశ్రమలకు వెళ్లే మార్గంలో మరియు పరిశ్రమల లోపల వారి భద్రతపై తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. పరిశ్రమలకు వెళ్ళేటపుడు వాహనాల కోసం వేచి వున్నప్పుడు, బస్ స్టాప్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొందరు ఏదో సాకుతో మాటలు కలిపి చైన్ స్నాచింగ్‌కు పాల్పడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే వెంటనే 100 లేదా 112 లేదా 1090 ఫోన్ నెంబర్ల ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళా కార్మికుల భద్రతకు పెద్దపీట వేస్తూ అవసరమైన చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతర ప్రత్యేక చర్యలు చేపట్టాలని పరిశ్రమల యాజమాన్యానికి సూచించారు. గంజాయి వాడకం, కోడి పందాలు, పేకాట వంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలపై ఏదైనా సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. వేలాది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ అత్యుత్తమ పారిశ్రామికవాడగా ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న శ్రీసిటీ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. ఇక్కడ ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు పోలీసుశాఖకు సహకరిస్తున్న శ్రీసిటీ సెక్యూరిటీ విభాగాన్ని అభినందిస్తూ, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్, సెక్యూరిటీ హెడ్ వై.రమేష్ పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# స్వచ్ఛ గూడూరుకు ప్రజలు సహకరించాలి

## ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్




'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై ఉన్న చెత్తను చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే నెల ఒకటో తేదీ వరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ప్రజలు చెత్తా చెదారాలను రోడ్లపై వేయకుండా చెత్తబుట్టలో వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సాదించగలమని, అందరూ సహకరించాలని పేర్కొన్నారు. పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, రహీమ్, మస్తాన్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా గూడూరు టూటౌన్‌లోని గురుకుల పాఠశాలలో పేద పిల్లల చేత కేక్ కట్ చేయించి పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేస్తున్న హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంకణాల పెంచలనాయుడు

## విజయవాడ వరద బాధితులకు


# డీఆర్‌డబ్ల్యూ కళాశాల చేయూత

## • లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేత




వరద బాధితులను ఆదుకొంటూ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో తనతో పాటు గూడూరు నియోజకవర్గానికి చెందిన 34 మంది టీడీపీ నాయకులు ఆరు రోజుల పాటు విజయవాడ నగరంలో పని చేయడం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల విద్యార్థినులు విజయవాడ వరద బాధితులకు సేకరించిన దుస్తులను తీసుకువెళుతున్న వాహనాన్ని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటి వరకు సుమారు 46 లక్షల రూపాయలు విరాళాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో డిఆర్‌డబ్ల్యూ కళాశాల యాజమాన్యం లక్ష రూపాయలు విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. కళాశాల కమిటీ మెంబరు యలవర్తి విద్యాసాగర్ చేతులమీదుగా చెక్కును అందజేశారు. అబ్దుల్ రహీం, బిల్లు చెంచురామయ్య, కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.





# భారీ అన్నదానం

గూడూరు రెండవ పట్టణ పరిధిలోని మోదుగవనంలో వెలసివున్న శ్రీ వరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 15వ తేదీ స్వామివారికి "లక్ష్మీగణపతి హోమం", అనంతరం 12గంటలకు భారీ "అన్నదానం" కార్యక్రమం జరిగాయి. గూడూరు శాసన సభ్యులు పాశిం సునీల్‌కుమార్ వరసిద్ధి వినాయకస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

# విద్యార్థినికి బలిజ మహిళా సంఘం ప్రోత్సాహం



డిగ్రీలో యూనివర్శిటీ ర్యాంకు సాధించిన తిరుమలశెట్టి సుప్రజ అనే విద్యార్థినికి బలిజ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు ప్రతిభా ప్రోత్సాహక బహుమతిగా ఎన్ఆర్ఐ సారంగం దేవిలత పంపిన ఐదు వేల రూపాయల నగదును అందించారు. సంఘం అధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ వివాహమై, ఇద్దరు పిల్లలతో కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించి, ఎటువంటి ట్యూషన్లు లేకుండా యూనివర్శిటీ ర్యాంకును సాధించిన సుప్రజను హృదయపూర్వకంగా అభినందిస్తున్నామన్నారు. సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి, సువర్ణలక్ష్మి, ఉషా, సాయి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా!...

## • విదేశాల అనుచిత జోక్యంపై 'జైశంకర్' విస్పష్ట సందేశం

*భారత విదేశీ వ్యవహారాల్లో కొత్త అధ్యాయం మొదలవబోతోందని భావించవచ్చా?.. ఇటీవల విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ సంధించిన పదునైన వాగ్బాణం కొత్త అధ్యాయానికి నాంది వాక్యంగా అనుకోవచ్చా?.. భారత విదేశీ వ్యవహారాల్లో కొత్త అధ్యాయం మొదలవ్వాలని, ఆ శాఖ చాలా శక్తిమంతంగా అవతరించాలని సామాన్య భారత పౌరులెందరో కోరుకుంటున్నారు. 'తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా.. విశ్వదాభిరామ వినుర వేమ' అన్నట్లుగా, అభివృద్ధి చెందిన దేశాలు, ముఖ్యంగా పాశ్చాత్య దేశాలు మన దేశం గురించి నోటికి ఏదొస్తే అది మాట్లాడినా, మన దేశపు ప్రతిస్పందన చాలా నీరసంగా ఉండి ఎంతో నిరాశపర్చేది. ధీటైన జవాబు ఆశించే సగటు భారత పౌరులకి పడికట్టు పదాలతో, బూజు పట్టిన మొక్కుబడి ప్రకటనలతో నిస్సత్తువ ఆవరించేది. ఈ నేపథ్యంలో, తాజాగా జైశంకర్ మాటలు చూస్తే, ఇప్పుడా పరిస్థితి అధిగమిస్తున్నట్లు అనిపిస్తోంది. మన దేశానికి ఇదో శుభపరిణామమే మరి!...*

**"మా అంతర్గత వ్యవహారాల్లో మీ జోక్యం తగదు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.'..**

ఎవరైనా విదేశీ ప్రతినిధి మన దేశ విషయాలపై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పుడు మన విదేశీ వ్యవహారాల శాఖ నుంచి సాధారణంగా వెలువడే ప్రకటన ఇది. కొన్ని దశాబ్దాలుగా కొద్దిగా అటు ఇటుగా ఇదే ప్రకటన వస్తుండడం అందరికీ తెలిసిందే. లేదంటే ఆత్మరక్షణ ధోరణిలో వివరణ ఇచ్చుకుంటున్నట్లుగా ఏదో నామమాత్రమైన ప్రతిస్పందన ఉండేది. అవతలి వారిని ఆత్మరక్షణ ధోరణిలో పడేసే ప్రతిస్పందన మన నుంచి కరవయ్యేది. దాడి చేసినప్పుడు ఆత్మరక్షణ ఎంత ముఖ్యమో ప్రతిదాడి కూడా అంతే ముఖ్యం. అయితే మొదటినుంచి ఆత్మరక్షణ ధోరణికి అలవాటు పడిపోయాం. మా ఇంటి సంగతి మీకెందుకు? ముందు మీ ఇంట్లో చెత్త సంగతి చూసుకోమని గట్టిగా జవాబు చెప్పొచ్చుగా అని సగటు పౌరులందరికీ అనిపించేది. ఎట్టకేలకు అలాంటి ధీటైన జవాబు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ నుంచి ఇటీవల వినిపించింది. వాస్తవానికి జైశంకర్ 2019లో విదేశీ వ్యవహారాల బాధ్యత చేపట్టినప్పటి నుంచి ఆ వ్యవహారాల్లో మంచి మార్పు కనిపించింది. దూకుడు పెరిగింది. ఇటీవల ఆయన జెనీవాలో విలేకర్లు అడిగిన ఒక ప్రశ్నకు ఇచ్చిన జవాబులో విదేశీ వ్యవహారాల్లో భారత్ భవిష్యత్తులో మరింత దృఢమైన వైఖరి అవలంబించనున్నట్లు కూడా స్పష్టమైంది.

భారత్‌లో విధులు నిర్వర్తిస్తున్న విదేశీ దౌత్యాధికారులు కొందరు ఇటీవల విపక్ష నేతలను కలిసిన తర్వాత చేసిన వ్యాఖ్యల గురించి జెనీవాలో జరిగిన ఒక కార్యక్రమంలో విలేకర్లు ప్రస్తావించారు. దీనికి జైశంకర్ బదులిస్తూ, విదేశీ రాయబారులు, విదేశీ నేతలు వారి వారి దేశాల గురించి భారత్‌కు ఉండే దృక్పథం, అక్కడ ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల గురించి కూడా వినాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. "మన రాజకీయాల గురించి వారు వ్యాఖ్యానిస్తే నాకేమీ అభ్యంతరం లేదు. అయితే అదే సమయంలో వారి రాజకీయాల గురించి నా వ్యాఖ్యలు వినడానికి వారు సిద్ధంగా ఉండాలి. అందరూ సమానమే అని అందరూ అంటారు. కానీ వాస్తవానికి వారెవరూ అలా ప్రవర్తించడం లేదు. విదేశాల్లో ఒక పని చేసేముందు అటువంటిదే తమ దేశంలో జరిగితే ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలి." అని గట్టి చురకంటించడం విశేషం.

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన దారుణ అత్యాచారం, హత్య సంఘటనపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "ఆ సంఘటనపై చలించని మనిషి లేరు. మన దేశంలో మహిళల భద్రత, వారిపై జరుగుతున్న నేరాలు ఒక సమస్యే. దానికి చాలా కారణాలున్నాయి. అయితే ఆ సమస్య ఇతర దేశాల్లోనూ ఉంది." అని అన్నారు. విదేశాల్లోనూ సమస్య ఉంది అని సూటిగా చెప్పడం ద్వారా ఆత్మరక్షణ ధోరణికి పరిమితం కాబోమని స్పష్టమైన ఆయన సంకేతమిచ్చినట్టయింది.

వివిధ దేశాల్లో వివిధ పరిస్థితుల గురించి అమెరికా అధ్యయన నివేదికలు విడుదల చేస్తుంటుంది. అసమానత్వం, వివక్ష, వివిధ నేరాలు ఆయా దేశాల్లో ఆందోళనకరంగా ఉన్నట్లు ఆయా నివేదికల సారాంశంగా ఉంటుంది. కానీ తమ దేశంలోని పరిస్థితుల గురించి అంతర్జాతీయంగా నివేదికలు బయటపెట్టదు. అక్కడ నల్లజాతీయులపై వివక్ష, దాడులు, చిన్నారులపై హింస, ఆసియా దేశాలపై పక్షపాతం వంటివి బహిరంగ రహస్యం. వాటి గురించి మాట్లాడకుండా, గురివింద గింజ తన నలుపు ఎరగనట్లు విదేశాల్లో తప్పులు ఎత్తి చూపుతుంటుంది. ఐరోపా దేశాలూ ఇలాంటి ఆధిపత్య, పక్షపాత ధోరణిని కనబరుస్తూనే ఉన్నాయి. ఈ ధోరణికి చారిత్రక మూలాలున్నాయి. మనుగడ సాధించడానికి చాలినన్ని సహజ వనరులు లేక, అవి పుష్కలంగా ఉన్న దేశాలపై దాడులు చేసి మనుగడ సాగించిన చరిత్ర కొన్ని దేశాలది. ఆ ఆధిపత్య భావజాలపు మూలాలు ఇంకా కొనసాగుతున్నాయి. అవతలి వారిని ఆత్మరక్షణ ధోరణిలోకి నెట్టి, ఆత్మన్యూనతకు లోనయ్యేలా చేసి తాము పైచేయి సాధించాలనుకునే ప్రతికూల మనస్తత్వం కొన్ని దేశాల్లో ఉంది. కానీ మనది మొదటి నుంచి సనాతన ధర్మం బోధిస్తున్న వసుధైక కుటుంబమే స్ఫూర్తిగల దేశం. ఆధునిక ప్రపంచం కూడా ఆ స్ఫూర్తితోనే సమస్త మానవాళి సుఖ సంతోషాలతో ఉండగలదు. ఈ సందేశం అవతలి వారికి స్పష్టంగా అర్థమయ్యేవరకు మెతక వైఖరిని వీడి సందర్భానుసారం కఠిన వైఖరిని అవలంభించాల్సిందే. అడపాదడపా కొన్ని పరిమితమైన అంశాల్లో చైనా, టర్కీ తదితర దేశాలూ పరిధిని మించి వ్యాఖ్యలు చేస్తున్నాయి. మనదేశం అంతర్గత విషయాల గురించి అనవసరంగా జోక్యం చేసుకునే దేశాల నోటికి తాళం పడాలంటే మనం ధర్మాగ్రహం ప్రదర్శించక తప్పదు. జైశంకర్ ఇప్పుడు అదే పని చేశారు. మాటల మంటలు పెట్టాలనుకునే వారికి మంచి వాతపెట్టారు. అయితే ఇది చాలదు. వ్యవస్థగా మనం ఇంకా బలపడాలి. అంతర్జాతీయంగా కొన్ని సర్వేలను గమనించినప్పుడు ప్రజాదరణ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మిగిలిన ప్రపంచనేతల కన్నా చాలా ముందున్నారు. అయితే వ్యక్తిగా శక్తిమంతుడైనట్లు కనిపిస్తున్నా వ్యవస్థ ఇంకా శక్తిమంతమవ్వాల్సి ఉంది. వ్యవస్థ శక్తిమంతమైతేనే దేశం శక్తివంతమవుతుంది బలమైన వ్యవస్థలకు అమెరికా, చైనాలు ఉదాహరణ. బలమైన వ్యవస్థగా అవతరించినప్పుడే అందరి నోళ్లూ మూతపడతాయి. అలా మనదేశం కూడా ఎదగాలి!...



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**



## జానకిరామ.. రామాయణం 31

- ఊటుకూరు జానకి రామారావు

కైకను తీవ్రపదజాలంతో దూషించారు.

**అతిప్రవృత్తే దుర్మేధే కైకేయీ కులపాంసని**

**వృయిత్వా చ రాజానం న ప్రమాణే అవతిష్ఠసి**

న్యాయమార్గంలో నడవకుండా రాజును మోసం చేశావుకదనే! కులఘాతకీ, దుర్బుద్ధీ, అడ్డూఅదుపు లేక ప్రవర్తించేదానా!

సీతమ్మ వనానికి వెళ్లవలసిన పని ఉందా?

( సీతమ్మకు కూడా నారచీర తెచ్చి ఇచ్చింది కదా, ఆవిడ కోరిక మేరకు రాముడొక్కడే వెళ్ళాలి, మరి లక్ష్మణునకు, సీతమ్మకు కూడా సిద్ధంచేసి ఉంచి వారు అడగడంతోనే తెచ్చి ఇచ్చింది! ఇక్కడే ఆవిడ దుర్బుద్ధి బయటపడింది).

కైక! నీవు చేసిన పని భరత శత్రుఘ్నులు సమర్థిస్తారనుకొన్నావా? భరతుడు దశరథుడికి పుట్టినవాడే అయితే ఈ విషయంలో నీవు తలక్రిందులుగా తపస్సు చేసినా ఆ వంశంలో పుట్టిన భరతుడు నిన్ను అనుసరించడు! తండ్రి తనకు మనఃపూర్వకంగా ఇవ్వనిదానిని తాను స్వీకరించడు!

అంతెందుకు? రాజ్యంలో అన్న లేకపోతే అన్న ఉన్నచోటే రాజ్యమని భరతశత్రుఘ్నులు రాముని వెంటే వెళతారు.

**నహి తద్భవితా రాష్ట్రం యత్ర రామో న భూపతిః**

**తద్వనం భవితా రాష్ట్రం యత్ర రామో నివత్స్యతి!**

రాముడు లేని చోటు అది రాజ్యమే కాదు! రాముడున్న వనమే రాజ్యం. తమ పిల్లాపాపలతో జనులంతా రాముని వెంటే కదులుతారు! పాడుపడి, పిచ్చిమొక్కలు మొలిచి నిలిచి ఉన్న నిర్మానుష్యమైన రాజ్యం, భరత శత్రుఘ్నులు లేక శోభావిహీనమైన అంతఃపురం మాత్రమే నీకు మిగులుతాయి.

కైకేయీ ఒక్కసారి బయటకు వచ్చి చూడు! పశుపక్ష్యాదులతో సహా అన్నీ తమ ముఖాన్ని రాముడున్న వైపే త్రిప్పి ఉన్నాయి.

సీతమ్మకు నారచీరలెందుకు ఇచ్చావు? ఈమె నారచీరలు కట్టవలెనని లేదే అని పలుకుతూ వసిష్ఠుల వారు సీతమ్మను నారచీర కట్టుకోవద్దని వారించారు.

సీత విషయంలో నీవు ఏ నిబంధన విధించలేదు కదా!

రాముడి ఆత్మ సీత. ఆమె ఇక్కడే ఉండి రాముడి సింహాసనం అధిష్ఠించగలదు!

**అనుష్ఠాస్యతి రామస్య సీతా ప్రకృతమాసనమ్...**

సీతమ్మ తనకు అత్యంత ప్రియమైన తన భర్తను వదిలి ఉండటానికి ఇష్టపడలేదు. తానుగా తరలింది వనవాసానికి.

లౌకిక దృష్టికి కైక చేస్తున్న పనులలో క్రూరత్వం కనిపిస్తుంది.

సామాన్యంగా ఆమెను రాముడికి ఇన్ని కష్టాలు కలిగించినదానిగా భావించి తిట్టిపోస్తాము మనమంతా!

ఒక్క క్షణం ఆలోచిద్దాం!

ఆమె ముగ్గురికీ దుస్తులు సిద్ధం చేసింది. ఆమె కోరిక మేరకు రాముడొక్కడే వెళ్లాలి. కానీ చిన్నప్పటినుండీ రాముడిని గారాబంగా పెంచింది ఆమె! ఆమెకు తెలుసు రాముడి నీడ లక్ష్మణుడని! అన్నని వదిలి ఆయన ఒక్కక్షణం కూడా ఉండడని! సీతారాముల అన్యోన్య దాంపత్యం చూసిన ఆమెకు అర్థమయ్యింది.. రాముడి ఆత్మ సీతేనని సీతమ్మ ప్రాణం రాముడేనని!

మరి మనిషిని.. అతని నీడ, ఆత్మ విడివిడి ఉంటాయా! అసంభవమది.

ఇకపోతే లోకకంటకుడైన రావణ వధ జరగాలంటే రాముడి ప్రయాణం మొదలుకావాలి! తండ్రి నుండి విడదీయాలి! దశరథుడి నుండి రాముడిని వేరు చేయగల సమర్థులు ఎవరు?

ఒకరు విశ్వామిత్రుడు! రెండు కైక!

మొదట విశ్వామిత్రుడు తాత్కాలికంగా విడదీసి దివ్యాస్త్ర జ్ఞానాన్ని ఇచ్చి రాముడిని రాబోయే సంగ్రామానికి సన్నద్ధుడిని చేశాడు. అది సరిపోతుందా! సరిపోదు! రాముడు బయటకు నడవాల్సిందే! ఇదిగో ఆ పని కైకమ్మ చేసింది!

రాముడెవరో కైకకు తెలుసు.. రాముడు నారాయణుడని రామ నారాయణుడని! మరి ఈ కోణంలో ఆలోచిస్తే కైక అమృతమూర్తి!

ఆమె తండ్రి ఒక రాజర్షి! ఒక చక్రవర్తి

ఆమె మామగారు ధర్మాత్ముడు, ఇంకొక చక్రవర్తి.

ఆమె భర్త జగదేకవీరుడు!

అంతఃపురంలోని జనులకు తప్ప ఎవరికంటాబడకుండా ఇన్నాళ్ళూ వైభవంగా జీవించింది.

మరి నేడో! నారచీర కట్టటమే రాక భర్త సహాయంతో చుట్టుకొని నిలుచుంది.

వనవాసం చేయ సంకల్పించుకుంది.

ఎంతకష్టం? ఎంతకష్టం? ఎండకన్నెరుగని రాకుమారికి ఎంతకష్టం?

ఎవరికి అపకారం చేసిందని? ఆమెకీ శిక్ష!

చూసేవారి హృదయం ద్రవించిపోతుంది.

ఇది తలుచుకొని కైకను తిట్టనివాడు లేడు.

దశరథుడు హృదయవిదారకంగా రోదిస్తున్నాడు. కైకను చూసి, "పాపాత్మురాలా రాముని అడవికి పంపి పాపాలు మూటకట్టుకుంటున్నావు, అవి చాలలేదా నీకు. ఈ సీతను కూడా కష్టపెడుతున్నావు! ఇన్ని పాపాలు అసలెందుకు చేస్తున్నావు?" అని అంటూ కడుదీనంగా విలపిస్తూ మూర్ఛపోతూ, మరల తేరుకుంటూ, మరలమరల కైకను తిడుతూ పిచ్చివానివలే ఉన్న తండ్రి సమీపంలోకి వచ్చి రాముడు...



తండ్రీ! నా తల్లి వృద్ధురాలైనది, నిన్నెప్పుడూ పల్లెత్తుమాట కూడా అని ఎరుగదు, సాధుస్వభావురాలు, నీచస్వభావమననేమో ఎరుగదు, అందరికీ వరాలిచ్చేవాడవు నా కొక్క వరాన్నీయవయ్యా! నన్ను చూసుకొని ఆమె బ్రతుకుతుంది.. నేను దగ్గరలేకుంటే ఆమె మానసం శోక సముద్రమే! ఆమెను కాస్త ఆదరంతో చూసుకో తండ్రీ! నీ ఆదరమే ఆమె ప్రాణాలు నిలుపుతుంది... అని వినయంగా పలికిన రాముని చూసి అతికష్టం మీద గొంతుపెగుల్చుకుంటూ విపరీతమైన దుఃఖం మనస్సును, శరీరాన్ని ఆవహించగా అతికష్టం మీద "రామా" అని మాత్రం అనగలిగాడు దశరథుడు.

మూర్ఛనుండి తేరుకున్న దశరథ మహారాజు ప్రక్కనే ఉన్న సుమంత్రుని చూసి, నీవు వీరి ప్రయాణానికి కావలసిన ఉత్తమ అశ్వాలు పూన్చిన రథాన్ని సిద్ధంచేయి, వీరిని మన దేశానికి అవతల ఉన్న వనాలలో విడిచిరా! అని ఆజ్ఞాపించాడు.

గుణవంతుడైన వారికి జరిగే సత్కారమిది, రాముడికున్న మంచి గుణాలకు కలిగే ఫలమిది! అని అందరూ అనుకొంటున్నారు (అని తనలో తనే అనుకున్నాడు దశరథుడు).

సుమంత్రుడు వెంటనే రథాన్ని సిద్ధం చేశాడు.

కోశాధికారిని పిలిచి కోడలికి పదునాల్గు సంవత్సరాలకు అవసరమైన అమూల్యమైన దుస్తులు, ఆభరణాలు(లెక్కకట్టిమరీ!) తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు దశరథుడు.

ఆ ఆభరణాలను చక్కగా అలంకరించుకొని ఉరకలేసే ఉత్సాహంతో ఉన్న సీతమ్మను దగ్గరకు తీసుకొని శిరస్సుపై ఆఘ్రాణించి, సీతా! నేడు నా కొడుకు ధనం లేని వాడని, వాడిని అవమానించకమ్మా! .. (సశేషం)

# వరద బాధితులకు.. సీనియర్ జర్నలిస్టు అంకబాబు సాయం

## ముఖ్యమంత్రి సహాయనిధికి 5 లక్షల విరాళం



విజయవాడలో వరద విపత్తులో ఉన్న ప్రజలకు సీనియర్ జర్నలిస్టు కొల్లు అంకబాబు అయిదు లక్షల రూపాయలను విరాళంగా అందించి తన మానవీయ తను చాటుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ఆ విరాళం మొత్తాన్ని ఇటీవల అందజేశారు. దాదాపు 40ఏళ్లుగా విజయవాడలో జర్నలిస్టుగా పని చేసిన తాను ఇంతటి దారుణమైన విపత్తును ఎప్పుడూ చూడలేదని, అమెరికాలో ఉద్యోగాల్లో ఉన్న తన కుమార్తె లక్ష్మి, కుమారుడు రంజిత్‌ల ప్రోత్సాహంతో, ఒక సామాజిక బాధ్యతగా ఆమేరకు బాధితులకు సాయంగా ఆ విరాళం ఇచ్చానని ఆయన తెలిపారు. జర్నలిస్టుగా కూడా ఇది తన బాధ్యత అన్నారు.

# షాకులు లేవు.. షేకులు లేవు.. అంతా ఫేకే

(మొదటిపేజీ తరువాయి)

రాగానే చాలామంది తిరుగు టపాలో జగన్ నీడకే వచ్చేశారు. ఎంతమంది వెళ్ళిపోయినా 2014 తరువాత జగన్ షాక్‌కి గురి కాలేదు, ఆయన పార్టీ షేక్ అవ్వలేదు. మళ్ళీ 2019లో అలాంటి పరిణామాలే జరిగి బాబుకి చాలామంది వీడ్కోలు చెప్పినా ఆయనా షాకవ్వలేదు.. ఆయన పార్టీ టీడీపీ కూడా షెకవ్వ లేదు. వ్యూహాత్మకంగా వ్యవహరించి మళ్ళీ 2024లో అధికారాన్ని బాబు దక్కించుకున్నారు. ఎన్నికలకి ముందే గతంలో వెళ్లిపోయిన వారిని పిలిపించుకున్నారు, ఇప్పుడు అధికారం వచ్చాక పక్క పార్టీలనుండి కొత్త వారిని కూడా రప్పించుకుంటున్నారు. ఇదంతా పొలిటికల్ గేమ్, రాజకీయ డ్రామా. ప్రతిపక్ష పార్టీని ఖాళీ చేయాలన్నది అధికారపార్టీ వ్యూహం అయితే, అధికార పార్టీలోకి వెళ్లి దొరికిన మేరకు దోచుకోవాలన్నది ఆ పార్టీలలోకి వెళ్తున్నవారి పథకం.. ప్రణాళిక!

### మారిన రాజకీయాలు!

రాజకీయాల సరళి మారిపోయింది. వ్యవహార పూరిత రాజకీయాలు, వ్యాపార భరిత రాజకీయాలుగా అవతరించాయి. ఒకప్పటి నిస్వార్ధ సేవాతత్వం, ఇప్పుడు స్వార్ధపూరిత వ్యాపార తత్వంగా మార్పు చెందింది. ఉన్నత విలువలకి వేదికగా ఉండాల్సిన రాజకీయ రంగం, నేడు వ్యక్తుల ఆధిపత్యానికి, వారి దోపిడీ తత్వానికి, నేతల రూపంలో ప్రజాక్షేత్రంలో తిరుగుతున్న అరాచక శక్తుల రాక్షసత్వానికి లొంగిపోయింది. జనపక్షం నిలవాల్సిన నాయకులు ధన పక్షం నిలుస్తున్నారు. ప్రజాహితం కోసం తపించాల్సిన నేతలు, నిత్యం అక్రమసంపాదనతో తరిస్తున్నారు. ఒకప్పుడు తాము నమ్ముకున్న నాయకుడి వెంట నడిచే నేతలు, ఇప్పుడు తమని తాము అమ్ముకుంటున్నారు. వ్యక్తిత్వ రాజకీయాలకి స్వస్తి పలికి వృత్తిత్వ రాజకీయాలకి ప్రాధాన్యత ఇస్తున్నారు. 'సేవే పరమావధి' అన్న మాటలకి పాతర వేసి, స్వాహా చేయడమే తమ విధి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

### పాత తరాన్ని ... మరిపించలేకపోతున్న కొత్త తరం!

పాత తరం నాయకుల తీరే వేరు. వారి సిద్ధాంతాలు, ఆశయాలు, ఆలోచనలు అనుసరణీయం, ఆచరణీయం వాళ్ళు నమ్ముకున్న పార్టీని వాళ్ళు వీడేవారు కాదు. మంచో చెడో ఒకే పార్టీలో కొనసాగేవారు. వారి అభిమానులు కూడా అంతే! తమ చివరి శ్వాస వరకు తమ నాయకుడి వెంటే ఉండేవారు. ఎవరైనా ఒక నేతని నమ్ముకున్న జనానికి పార్టీతో పని లేదు, తమ నాయకుడి వెంటే తాముండేవారు. ఆనాటి నాయకులు కూడా తమ అనుయాయులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానిచ్చేవారు కాదు. తమ అభిప్రాయాలని ఆలోచనలని ప్రజలపై రుద్దేవారు కాదు. ప్రజల అభీష్టం మేరకు తాము నడుచుకునేవారు. ఉదాహరణకి ఒక్క నెల్లూరు జిల్లానే తీసుకుంటే.. తొలి తరంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన బెజవాడ గోపాలరెడ్డి ఎంతోమందికి ఆదర్శం. ఆ తర్వాత రాజకీయంగా ఇక్కడి నుండి జాతీయస్థాయికి ఎదిగి ఉపరాష్ట్రపతి పదవిని అలంకరించిన ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆది నుండీ ఒకే పార్టీలో కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రులుగా పనిచేసిన నేదురుమల్లి జనార్ధనరెడ్డి, డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, కేంద్ర రాజకీయాలలో కీలకపాత్ర పోషించిన జైపాల్‌రెడ్డి లాంటివాళ్ళు ఏక పార్టీ సిద్ధాంతాన్ని పాటించిన వాళ్ళే. ఇంకా అలాంటి వాళ్ళు చాలామందే ఉన్నారు. వాళ్లంతా జనం కోసం రాజకీయాలు చేసేవారు తప్ప ధనం కోసం కాదు.

ఇప్పటి తరం నేతలు అలాకాదు. వారికి అధికారం ముఖ్యం. సంపాదన ముఖ్యం. వారి మనుగడ ముఖ్యం. అందుకోసం ఎంతటి స్థాయికైనా తగ్గుతారు. ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల హవా పెరిగిన తరువాత ఈ తరహా నయా నాయకులు పుట్టుకొస్తున్నారు. తాము పోటీచేసి ఓడిపోయిన పార్టీలని వీడి గెలిచిన పార్టీల గూటికి చేరిపోతున్నారు. ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలో తమ నోటితో బండ బూతులు తిట్టిన పార్టీని, ఆ పార్టీ నాయకుడిని పొగడ్తలతో ముంచేస్తారు. కాబట్టి ఏ నాయకుడు ఏ పార్టీని వీడినా అది ఎవరికి షాకు కాదు, ఏ పార్టీ కూడా వారి పోకతో షేకు కాదు. ఈ నాయకులే అంతా ఫేకు. ఎక్కడ అధికారం ఉంటే అక్కడకి చేరిపోతారు. అక్కడ అధికారం పోతే.. మళ్ళీ ఇక్కడే వాలిపోతారు.

### జగన్‌కి బాయ్ చెప్పిన బాలినేని!

ప్రకాశం జిల్లాలో అత్యంత కీలక నేత బాలినేని శ్రీనివాసరెడ్డి. జగన్ బాబాయ్ వై.వి.సుబ్బారెడ్డికి స్వయాన చెల్లెలి భర్త. వాసుగా ఆయన జిల్లా ప్రజలకి సుపరిచితం. ముఖ్యంగా 1989 నుండి జిల్లా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాలలో చురుకుగా పాల్గొనేవారు. 1991లో మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రకాశం జిల్లా రాజకీయాలలో అడుగుపెట్టినప్పటి నుండి ఆ జిల్లాలో, ముఖ్యంగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో బాలినేని ప్రాముఖ్యత పెరిగింది. ఓ వైపు సుబ్బరామిరెడ్డికి అత్యంత అంతరంగికుడిగా, మరో వైపు వై.వి. సుబ్బారెడ్డి ద్వారా వై.ఎస్.రాజశేఖరరెడ్డికి సమీప బంధువుగా ఆయనకి ప్రాధాన్యత లభించింది. అయితే, బాలినేని రాజకీయ అరంగేట్రం చేసిన రెండు దశాబ్దాల తరువాత అక్కడ రాజకీయ ముఖచిత్రం మారింది. రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో ఆయన షడ్డకుడు, వాసు బావ వై.వి.సుబ్బారెడ్డి అనూహ్యంగా ప్రత్యక్ష రాజకీయాలలో అడుగుపెట్టారు. ఇక్కడి నుండే ఒంగోలులో ఆధిపత్య పోరుకి బీజం పడింది. కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా కొనసాగుతుండిన బాలినేని తన పదవికి రాజీనామా చేసి జగన్ పక్కన చేరారు. తాను ఎంత త్యాగం చేసి వచ్చినా జగన్ వై.వి. పక్షమే ఉన్నాడన్న అసంతృప్తి బాలినేనిలో తరచూ వ్యక్తమవుతూనే ఉండేది. ఆయన బాధకి తగ్గట్లుగా జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఆయనని అవమానించారు. 2019లో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి పదవి ఇచ్చినట్లే ఇచ్చి సగంలో లాగేసుకున్నారు. ఎన్నికల తరుణంలో కూడా బాలినేని వద్దంటున్నా వినకుండా మాగుంట శీనయ్యని వైసీపీ నుండి గెంటేశారు. చెవిరెడ్డిని తెచ్చి బాలినేని నెత్తినపెట్టారు. అవన్నీ బాలినేని కష్టం కలిగించే అంశాలే. అప్పటినుండే ముందుకీ వెనక్కి ఊగిసలాడుతుండిన బాలినేని ఎట్టికేలకి వైసీపీకి రాజీనామా చేసి బయటకి వచ్చేశారు. గురువారం, 19వ తేదీ సాయంత్రం 4.00 గంటలకి మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తో భేటీ అయ్యారు. ఇద్దరూ గంటకిపైగా చర్చించుకున్నారు. బాలినేనిని పవన్‌కళ్యాణ్ తమ పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. పార్టీ బాలినేనికి సముచిత స్థానం కల్పిస్తుందన్న హామీ ఇచ్చినట్లు కూడా విశ్వసనీయ వర్గాల వార్త.

### బాబాయ్‌కి లేని బంధుప్రీతి బావకెందుకు?

జగన్‌మోహన్‌రెడ్డిని, సుబ్బారెడ్డిని కాదని బాలినేని పార్టీని వీడి వెళ్లిపోవడం పట్ల ఒంగోలు ప్రజలలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. వాసు అలా వెళ్లిపోవడం తప్పని కొందరు అంటే.. కానేకాదని మరికొందరు సమర్ధిస్తున్నారు. విజయమ్మ చెల్లెల్ని చేసుకున్న సుబ్బారెడ్డి విజయమ్మని కాదని జగన్ వెంట నడుస్తున్నపుడు, సుబ్బారెడ్డి చెల్లెల్ని చేసుకున్న బాలినేని వాసు, సుబ్బారెడ్డిని కాదని మరొకరితో కలిస్తే తప్పేంటని వాసు అనుయాయుల వాదన. మొత్తంమీద కృష్ణార్జునుల పోరులో అర్జునుడు బావతో విభేదించి బయటకి వచ్చేశాడు. ఈ పరిణామం భవిష్యత్ ఒంగోలు రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతోందో వేచి చూడాలి!

అయితే సుబ్బారెడ్డికి స్వయానా చెల్లెలి భర్త, జగన్‌కి సమీప బంధువు బాలినేనే బయటకి వస్తే.. రాష్ట్రంలో ఆయన బాటలో మరెంతమంది నడవబోతున్నారో...? అన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయవర్గాల నుండి వినపడడం గమనార్హం!

# గిరిజనుల జీవితాల్లో..కొత్త వెలుగులు రావాలి

- ఓ కాలనీని దత్తత తీసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆకాంక్ష



ఎంతోకాలంగా అంధకారంలోనే ఉన్న గిరిజనుల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆకాంక్షించారు. కేవలం ఉత్తుత్తి మాటలతో సరిపెట్టుకోక, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, తనవంతుగా ముత్తుకూరు మండలం పైనాపురం చిన్నసంఘం గిరిజన కాలనీని దత్తత తీసుకుని, ఆ కాలనీ అభివృద్ధికి ఆయన కంకణం కట్టుకున్నారు. ఇటీవల ఆ కాలనీలోని దయనీయ పరిస్థితులను చూసి ఆయన ఆవేదన చెందారు. కేవలం 100లోపు కుటుంబాలు ఉండే ఈ కాలనీలో 46మందికి ఆధార్ కార్డులు లేకపోవడం, 16మందికి అర్హత ఉన్నా పింఛన్ రాకపోవడం, 41 కుటుంబాలకు ఇళ్లు లేకపోవడం, 29 మందికి ఇళ్ల స్థలాలు లేకపోవడం, 22 మందికి చెందిన ఇళ్లు శిథిలావస్థలో ఉండడం ఏమిటంటూ ఆ కాలనీ దుస్థితిపై విచారం వ్యక్తంచేశారు. ఆ కాలనీ సమస్యలన్నీ తీర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. అమాయకులైన గిరిజనులకు కనీస అవసరమైన ఆధార్ కార్డు కూడా ఇప్పించకపోవడంపై సచివాలయ సిబ్బందిపై సోమిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సమాజంలో అత్యంత అమాయకులైన గిరిజనుల్లోనే పేదరికం ఎక్కువగా ఉందని, నిరక్షరాస్యులు కూడా గిరిజనుల్లోనే ఉన్నారని, అన్నివిధాలుగా మోసపోతోంది కూడా వాళ్ళేనని అంటూ, ఇకనైనా గిరి జనుల్లో మార్పు కోసం అందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఆరోగ్య రూరల్ లక్ష్యంగా...

# 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష'!

## సంపూర్ణ ఆరోగ్య యజ్ఞాన్ని తలపెట్టిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి




పేదలకి అవసరమైన వైద్యచికిత్సలను కార్పొరేట్ హాస్పిటల్స్ వైద్యులతో అందించేందుకు, వ్యాధి నిర్ధారణ అయితే ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందుబాటులో ఉంచేందుకు తెలుగుదేశం పార్టీ యువనేత, 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష' పేరుతో ఓ అద్భుతమైన కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టారు. ఇటీవల నెల్లూరులోని తమ కార్యాలయంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నారా లోకేష్ ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్తిరెడ్డితో కలిసి లోగోని ఆవిష్కరించారు. ఈనెల 22వ తేదీన నరసింహకొండలో శ్రీ నరసింహస్వామి పాదాలచెంత ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని, ఆరోజు నుంచి రూరల్ నియోజకవర్గంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ఎదుర్కొని 'యువగళం' నిర్వహించిన లోకేష్ పేరును ఈ కార్యక్రమానికి పెట్టామని చెప్పారు. పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి కార్పొరేట్ స్థాయి చికిత్సలు అందిస్తామని తెలిపారు.

# పాత కాపులకే.. కొత్త పెత్తనం

(3వ పేజీ తరువాయి)

అటునుంచి ఇటుకు, ఇటునుంచి అటుకు మారారే తప్ప, ఈ సరికొత్త నియామకాల్లో కొత్తదనం ఏముందంటూ రాజకీయవర్గాల్లోనూ చర్చగా ఉంది. అసలే, పార్టీ పరిస్థితి ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉండడంతో, ఇక ఆ పార్టీ పాలనలోకి వచ్చే పరిస్థితి కూడా ఉండకపోవచ్చనే నిరాశతో పార్టీ వీరవిధేయులు సైతం బహిరంగంగానే పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు. అధికారపార్టీ అయిన తెలుగుదేశం పార్టీలో చేరడానికి మార్గాలు వెతుక్కుంటున్నారు. ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు వంటి నాయకులు కూడా రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీకి కూడా గుడ్‌బై చెప్పేయడం తెలిసిందే. ఇలాంటి సంక్షోభ దశలో.. జిల్లా పార్టీని గట్టెక్కించడానికి యువతరం నాయకత్వం రావాల్సి ఉంది. కానీ అలాంటివారి ఊసే లేకపోవడం కొసమెరుపు. అయితే, వాస్తవానికి అలాంటి నాయకత్వ పటిమ ఉన్న కొత్తవారెవరూ లేకపోవడం వల్లనే, పార్టీలో మళ్ళీ పాతకాపులకే కొత్తఛాన్స్ దొరికిందనుకోవచ్చని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. చూదాం!.. చివరి వరకు ఉండేదెవరో? ఊడేదెవరో??

## 'పొదుపు' డబ్బును లీడర్లే మింగేస్తున్నారు




పొదుపు మహిళలు నెలవారీగా చెల్లించే డబ్బును బ్యాంకులకు జమ చేయకుండా, కొందరు పొదుపు లీడర్లే వాటిని మింగేస్తున్నారంటూ పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 14న నెల్లూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన 'జనవాణి' కార్యక్రమంలో పొదుపు మహిళా సంఘాల వారు పాల్గొని, పొదుపు గ్రూపుల్లో జరుగుతున్న అన్యాయాలను వెల్లడించారు. పేద మహిళల నిరక్షరాస్యతను అదునుగా చేసుకుని కొందరు పొదుపు లీడర్లు ఒక్కో గ్రూపులో లక్షలాది రూపాయలను దుర్వినియోగం చేస్తున్నారంటూ తోటపల్లి గూడూరు మండలం నరుకూరు పొదుపు మహిళా సంఘాలకు చెందిన పలువురు మహిళలు ఫిర్యాదుచేశారు. అనేక గ్రూపుల్లో లక్షలాది రూపాయల అక్రమాలు జరిగాయని తెలిసినా సంబంధిత అధికారులు ఏళ్ళ తరబడిగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇకనైనా ఈ అక్రమాలను సమగ్రంగా విచారించి దోషులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జనసేన నాయకుడు గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన లీగల్‌సెల్ జిల్లా ఇన్‌చార్జి చదలవాడ రాజేష్, నాయకులు జమీర్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించండి

- బీజేపీ కిసాన్‌మోర్చా వినతి



జిల్లాలో ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేక వరి రైతులు అవస్తలు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని భారతీయ జనతాపార్టీ కిసాన్‌మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గత కొంతకాలంగా ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు తెగుళ్లు రైతాంగాన్ని నష్టాలపాలు చేస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో మిల్లర్లు ధాన్యాన్ని తక్కువ ధరలకే కొంటూ రైతులను మోసం చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని ఆయన కోరారు. సోమశిల జలాశయంలో 50 టీఎంసీల నీరు ఉంది కనుక, రబీ సీజన్‌కు నీటి విడుదల విషయమై జిల్లా సాగునీటి సలహామండలి సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రతి ఎకరాలకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. యుద్ధప్రాతిపదికన చెరువులకు మరమ్మతులు చేయించాలని, పూడిపోయిన పంట కాలువల్లో పూడిక తీయించాలని విజ్ఞప్తి చేశారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వినయ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నరసింహకొండ ఆలయానికి..

## రూ. 12.69 లక్షల ఆదాయం

నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై కొలువైవున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ. 12 లక్షలకు పైగానే రాబడి వచ్చింది. ఈనెల 13న హుండీ లెక్కింపు జరగ్గా, 110 రోజులకు మొత్తం 12,69,360 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ఈ లెక్కింపును దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి, ఇఓ సుధీర్‌తదితరులు పర్యవేక్షించారు.

## చెర్లోపల్లిలో.. వెంకయ్యస్వామికి పూజలు

మనుబోలు మండలం చెర్లోపల్లి రైల్వేగేటు వద్ద ఉన్న అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మందిరంలో అర్చకులు ఈనెల 14న స్వామివారికి పట్టు వస్త్రాలు అలంకరించి పూజలు, అభిషేకాలు, ధునిపూజ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నెల్లూరు చిన్నబజార్‌కు చెందిన న్యూ సాయినాథ్ జ్యూయలరీ అధినేత రత్నంశెట్టి ఉభయదాతగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నవితరణ గావించారు.



### 22 నుంచి 26 వరకు..

## వెంకటగిరి పోలేరమ్మ జాతర

- గోడపత్రికలు ఆవిష్కరించిన మంత్రి ఆనం

రాష్ట్రంలోనే ఎంతో ప్రసిద్ధమైన వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆమేరకు జాతర నిర్వహణకు ఆలయ కమిటీవారు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో జాతర వివరాలను తెలిపే గోడపత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగగా అంగరంగవైభవంగా జాతరను నిర్వహిస్తామని, నిర్వహణకు కోటి రూపాయలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఈ ఏడాది అమ్మవారికి బంగారుపాదాలు చేయించడానికి కమిటీ సంకల్పించిందని, పోలేరమ్మ ఉత్సవాల నాటికి అమ్మవారికి పాదాలు చేయించి అమ్మవారి ఆశీస్సులు అందుకుంటామన్నారు. స్థానిక శాసనసభ్యులు, కమిటీ సభ్యుల సహకారంతో జాతరను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని, జాతరలో రెండు రోజులు పాటు తాను వెంకటగిరిలోనే ఉంటానని ఆయన తెలియజేశారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఇఓ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## విఎస్‌యు వీసీని కలసిన.. డాక్టర్ కేవీ స్వామి



ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్ డైరెక్టర్ డా.కేవీ స్వామి ఇటీవల నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం(విఎస్‌యు) వైస్‌చాన్సలర్ ఆచార్య ఎస్.విజయభాస్కరరావును మర్యాదపూర్వకంగా కలుసుకుని విద్యాసంబంధమైన పలు అంశాలను చర్చించారు. విశ్వవిద్యాలయంలోని అకడమిక్ కార్యక్రమాలు, పరిశోధనా విధానాలు, నైపుణ్యాలపై ఉన్న ప్రాధాన్యత గురించి వారు మాట్లాడుకున్నారు. విద్యార్థులు మంచి భవిష్యత్తును సాధించుకోవాలంటే సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని, పరిశోధనలతో నైపుణ్యాలను సాధించాలని ఈ సందర్భంగా డా.కేవీ స్వామి సూచించారు. 'విద్యార్థులకు విద్యతోపాటు నైపుణ్యాలను కూడా పెంచడంలో విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ముందంజలో ఉందని, జాతీయస్థాయిలో ఉన్న మార్గదర్శకాలను అనుసరించి, నైపుణ్యాల ఆధారంగా కూర్చిన విద్యా కార్యక్రమాలను అమలుచేస్తున్నామని వీసీ విజయభాస్కర్‌రావు తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, డాక్టర్ జె.విజేత, డాక్టర్ సాయి స్రవంతి, డాక్టర్ పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొనారు.

## గోవిందరాజు సీతాదేవి స్మారక.. నవలలు, కథా సంపుటిల పోటీ

తమ తల్లి..సుప్రసిద్ధ రచయిత్రి గోవిందరాజు సీతాదేవి పేరుతో నెల్లూరులోని ఆమె కుమార్తె..ప్రముఖ కవయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో నవలలు, కథాసంపుటిల పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు 'గోవిందరాజు సీతాదేవి జాతీయ స్మారక సాహితీ పురస్కారం-2024' అందజేయనున్నారు. పోటీలో పాల్గొనదలచినవారు 2023లో ప్రచురితమైన తమ స్వీయ నవలలు, కథా సంపుటిలు పంపాలని, విజేతలకు నవలకి రూ. 5వేలు, కథాసంపుటికి రూ. 5వేలు వంతున బహుమతుచ్చి సత్కరిస్తామని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రచనలను డిసెంబరు 31వ తేదీలోగా గోవిందరాజు సుభద్రాదేవి, డోర్ నం. 26-15-494, స్నేహనగర్-ప్రసాద్ అవెన్యూ, కొండాయపాళెం రోడ్డు, నెల్లూరు-4 అనే చిరునామాకు పంపాలని ఆమె కోరారు.

## 21న..మహాకవి గురజాడ జయంతి సభ

నెల్లూరు టౌన్‌హాలులోని వర్ధమాన సమాజం భవనంలో ఈనెల 21న మహాకవి గురజాడ అప్పారావు 162వ జయంతి సభ జరుగనుంది. ప్రధానవక్తగా 'శ్వేత' పూర్వ డైరెక్టర్, ప్రముఖ సాహితీవేత్త డా.భూమన్ పాల్గొని గురజాడ జీవితం-రచనలు వగైరా విశేషాలను వివరించనున్నారు. సభకు స్థానిక కుట్టి విద్యాసంస్థల అధిపతి లతీఫ్ కుట్టి అధ్యక్షత వహిస్తారని, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సర్వోదయ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డా.కాళిదాసు పురుషోత్తం ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని, సభను విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం సుబ్రహ్మణ్యం నిర్వహిస్తారని 'కన్యాశుల్కం' నాటక ప్రదర్శన కమిటీ నిర్వాహకులు చిరసాని కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## టూకీగా...



### అయ్యగారిపాళెంలో పౌష్టికాహారంపై అవగాహన

పొదలకూరు మండలం అయ్యగారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 14న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం పట్ల అవగాహన కలిగించారు. గర్భవతులకు సీమంతాలు చేసి, చిన్నపిల్లలకు అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త మన్నవరపు జయలక్ష్మి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

### చౌటపాళెంలో..ఉచిత పశువైద్య శిబిరం

జిల్లా పశుసంవర్ధకశాఖ, స్థానిక మండవ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 17న వెంకటాచలం మండలంలోని చౌటపాళెంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. గేదెల వ్యాధులకు చికిత్సలు చేసి, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కసుమూరు పశువైద్యాధికారిణి సుష్మ, ఫౌండేషన్ వైద్యాధికారి శ్రీనివాసులునాయుడు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

### ఆదెమ్మసత్రం స్కూల్‌లో.. నులిపురుగుల నివారణ

ఇందుకూరుపేట మండలం ఆదెమ్మసత్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 17న వైద్యాధికారి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ కార్యక్రమం కింద ఆల్బెండజోల్‌మాత్రలు మింగించారు. చేతుల శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. సూపర్‌వైజర్ రమ, పాఠశాల హెడ్మాస్టర్ రాజేశ్వరి, సిహెచ్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

### జొన్నవాడలో కనువిందుగా.. కల్యాణోత్సవం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసి ఉన్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో స్వామివారికి-అమ్మవారికి ఈనెల 17న ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, కనువిందుగా కల్యాణోత్సవం నిర్వహించారు. నిత్యకల్యాణోత్సవంలో భాగంగా జరిగిన ఈ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### కలువాయి వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

ప్రధాని నరేంద్రమోడీ జన్మదినోత్సవం సందర్భంగా ఈనెల 17న మండల కేంద్రమైన కలువాయిలో ఉన్న వృద్ధాశ్రమంలో వృద్ధులను పరామర్శించి వారికి పండ్లు పంపిణీ చేశారు. స్థానిక బీజేపీ నాయకులు దండు పెంచలయ్య, పగిడి పెంచల ప్రసాద్, బ్రహ్మారెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

### కందుకూరులో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం

కందుకూరులోని టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 17న ఓజోల్ పరిరక్షణ దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ డా.రవికుమార్ పాల్గొని విద్యార్థులకు ఓజోన్ పొర ప్రాధాన్యతను తెలియజెప్పారు. పర్యవరణాన్ని కాపాడుకోకుంటే ఓజోన్ పొర దెబ్బతింటుందని, ప్రతి విద్యార్థి మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా హిందీ భాషా దినోత్సవం

హిందీ భాషా దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 14న కందుకూరులోని బిఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్‌లో వేడుకలు నిర్వహించి, హిందీ భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యాసంస్థల ఛైర్మెన్ ఉన్నం భాస్కర్‌రావు, కరెస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కొరుటూరులో అన్నదానం

ఇందుకూరుపేట మండలంలోని కొరుటూరు గ్రామంలో ఈనెల 16న మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా ముస్లిమ్ సోదరులు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం, పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. టీడీపీ మండల నాయకుడు రావెళ్ల వీరేంద్రనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### మామిడిపూడిలో.. గడ్డివామి దగ్ధం

ముత్తుకూరు మండలం మామిడిపూడిలో ఈనెల 14న అగ్నిప్రమాదం జరిగి ఓ రైతుకు చెందిన 20 ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతైపోయింది. గుర్తుతెలియని వ్యక్తులెవరో గడ్డివామికి నిప్పు పెట్టివుంటారని, దీంతో 2 లక్షల విలువైన గడ్డి తగులబడిపోయిందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

## వైసీపీకి.. నెల్లూరు కార్పొరేషన్లో కూడా..


# 11 మందే మిగిలారు


**లోకేష్ సమక్షంలో తాజాగా టీడీపీ కండువా కప్పుకున్న 14 మంది కార్పొరేటర్లు**



వైసీపీకి 11 సంఖ్య బాగా కలిసొస్తున్నట్లు కనిపిస్తోంది. నెల్లూరు నగర కార్పొరేషన్‌కి చెందిన మరో 14మంది కార్పొరేటర్‌లు 19వతేదీ,గురువారం మధ్యాహ్నం అమరావతిలో విద్యాశాఖ మంత్రి లోకేష్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. నెల్లూరునగర, రూరల్ పరిధిలో మొత్తం 54 మంది కార్పొరేటర్లు ఉండగా వీరిలో 29 మంది ఎప్పుడో టీడీపీలో చేరిపోయారు. తాజాగా చేరిన 14 మందితో ఆ సంఖ్య 43కి చేరింది. మేయర్‌తో కలిపి 11 మంది మాత్రమే వైసీపీ సభ్యులుగా కార్పొరేషన్‌లో మిగిలారు. వైసీపీ హయాంలో నుడా ఛైర్మెన్‌గా నామమాత్రపు సేవలందించిన ఆర్యవైశ్య ప్రముఖుడు ముక్కాల ద్వారకనాథ్ కూడా గురువారం తెలుగుదేశానికి జై కొట్టి, పచ్చ కండువా కప్పుకున్నారు. మునిసిపల్ మంత్రి నారాయణ, డెప్యూటీ మేయర్ రూపకుమార్ సమక్షంలో పార్టీలో చేరిన కార్పొరేటర్లకి నారా లోకేష్ కండువాకప్పి స్వాగతం పలికారు. తొలి నుండీ వైసీపీకి కంచుకోటలా ఉన్న నెల్లూరులో జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారాయి.

మొత్తానికి ఈ పదకొండు సంఖ్య రాష్ట్రంలో ఇంకా ఎంత గందరగోళాన్ని సృష్టిస్తుందోనని రాష్ట్ర వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతుండడం కొసమెరుపు!



Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com